Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో.. ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు. నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541
ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 176 | హైదరాబాద్ | బుధవారం 20 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

### వారంలో రెండోసారి.. లీటర్‌పై 4 మేర భారం

### డీజిల్‌దీ అదే దారి.. కొరత లేదంటూనే వాత

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

భారతదేశంలో వాహనదారులకు భారీ షాక్ ఇస్తూ చమురు కంపెనీలు ఒకే వారంలో రెండోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచాయి. గత శుక్రవారం (మే 15) లీటరుకు రూ.3 చొప్పున పెంచిన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, తాజాగా నేడు (మే 19) సగటున మరో 90 పైసల మేర ధరలను పెంచాయి. దీనితో కేవలం 4 రోజుల వ్యవధిలోనే లీటర్ ఇంధనంపై దాదాపు రూ. 3.90 వరకు అదనపు భారం పడింది. తాజా పెంపు తర్వాత హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ రూ. 110.85, ఢిల్లీ రూ. 98.64. ముంబై రూ. 107.59,

- మిగతా 2వ పేజీలో



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏదైనా టార్గెట్ చేశారంటే దానిని సాధించి తీరుతారని చెబుతారు. కానీ, ఆయన ఇప్పుడు పెట్టుకున్న టార్గెట్ రీచ్ అవుతారా? అంత సులభంగా ఆయన కల నెరవేరుతుందా అన్నది తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.తక్కువ కాలంలోనే తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టి, ఇంకా రెండున్నరేళ్ల పదవీ కాలం ఉండగానే సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పీఠం కల బయటపెట్టారు. తనకు జాతీయ ఆశలు ఉన్నాయని కానీ ఇప్పుడే కాదని చెబుతున్నారు.

# రేవంత్‌ను ఊరిస్తున్న ఢిల్లీ పీఠం!

### అనుకున్న లక్ష్యం నెరవేరేనా?.. గతంలోనూ పలువురి ప్రయత్నం

- మహామహులే దెబ్బతిన్న వైనం
- జాతీయ పార్టీలో సాధ్యమేనా?
- పథకాలు అమలు చేస్తేనే ఇక్కడ రెండోసారి అవకాశం

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

'నీ లక్ష్యం పది మైళ్లు అనుకుంటే.. పదకొండవ మైలుకు టార్గెట్ చేయి.. కొడితే దిమ్మతిరిగిపోవాలి' ఇదో పాపులర్ సినిమా డైలాగ్. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఏదైనా టార్గెట్ చేశారంటే దానిని సాధించి తీరుతారని చెబుతారు. కానీ, ఆయన ఇప్పుడు పెట్టుకున్న టార్గెట్ రీచ్ అవుతారా? అంత సులభంగా ఆయన కల నెరవేరుతుందా అన్నది తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తక్కువ కాలంలోనే తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టి, ఇంకా రెండున్నరేళ్ల పదవీ కాలం ఉండగానే సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పీఠం కల బయటపెట్టారు. తనకు జాతీయ ఆశలు ఉన్నాయని కానీ ఇప్పుడే కాదని చెబుతున్నారు. 2034లో అని చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు ఇక్కడి నుంచి పలువురు నేతలు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పినా.. కొందరు ప్రధాన పీఠంపై కూర్చుంటారని ప్రచారం జరిగినా.. అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరలేదు.

#### ఎన్టీఆర్ నుంచి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మలుపుతిప్పిన ఘటన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ఎన్టీఆర్ సీఎం అయ్యారు. ఆయన పాలన సంగతి పక్కన పెడితే ఒక దశలో జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలతో ఏర్పాటైన ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆయన జాతీయ పీఠంపై కూర్చుంటారని ప్రచారం

- మిగతా 2వ పేజీలో



## చమురు కొనుగోళ్లకు గడువు పెంపు

### భారత్‌కు ట్రంప్ మినహాయింపులు

న్యూఢిల్లీ, మే 19: రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వెసులు బాటు కల్పించారు. ట్రంప్ గత నిర్ణయం ప్రకారం ఈ నెల 16తో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేయాల్సి ఉంది. కానీ, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతుండటం, చమురు సరఫరాకు ఆటం కాలు కలుగుతుండటం వల్ల ఆ గడువును జూన్ 17 వరకు పొడిగించారు. ట్రంప్ నిర్ణయాన్ని మంగళ వారం ఆ దేశపు ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ ధ్రువీకరించారు. ఈ నిర్ణయంతో దేశీయ రిఫైనరీలు రష్యా నుంచి సునాయాసంగా చమురు దిగుమతి చేసుకు నేందుకు అవకాశం ఉంటుంది. అ యితే.. అమెరికా మినహాయింపులతో తమకేమీ సంబంధం లేదని, దీనిలో భాగంగానే తాము ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని భారత ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించడం గమనార్హం.



## బంధాలు ఉన్నతస్థాయికి

### భారత్, నార్డిక్ దేశాల మధ్య గ్రీన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ వ్యూహాత్మక భాగస్వామ్యం

### మూడో ఇండియా-నార్డిక్ సదస్సులో నిర్ణయం

ఓస్లో: తమ సంబంధాలను ఇకపై గ్రీన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని భారత్, నార్డిక్ దేశాలు నిర్ణయించుకున్నాయి. భారత ప్రధాని మోదీ మంగళవారం నార్వే రాజధాని ఓస్లోలో మూడో ఇండియా--నార్డిక్ సదస్సులో పాల్గొన్నారు. క్లీన్ ఎనర్జీ, సుస్థిరాభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, నవీన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కీలక రంగాల్లో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. మోదీతోపాటు ఐస్‌లాండ్ ప్రధాని క్రిస్ట్రన్ ఫ్రొస్టాడాటిర్, ఫిన్‌లాండ్ ప్రధాని పెటెరీ ఓర్పో, డెన్మార్క్ ప్రధాని మెటే ఫ్రెడరిక్సన్, నార్వే ప్రధాని జోనా గర్ స్టోర్, స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ ఈ సదస్సుకు హాజరయ్యారు. అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఉగ్రవాదంపై భారతదేశం, నార్డిక్ దేశాలు స్పష్టమైన, ఐక్య వైఖరిని కలిగి

- మిగతా 2వ పేజీలో

# జలమండలిలో అవినీతి తిమింగలం

### జీఎం ఇంట్లో ఏసీబీ తనిఖీలు.. సుమారు వంద కోట్లకుపైగానే అక్రమ ఆస్తులు

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

తెలంగాణలో ఎక్కడ ఏసీబీ దాడులు జరిగిన అవినీతి అధికారుల ఇళ్లలో కట్టకట్టలుగా కరెన్సీ, భారీ ఎత్తున బంగారం బయటపడుతుండటంతో సామాన్యుడు నోరెళ్లబెడుతున్నాడు. రోజంతా కష్టపడినా కడుపునకు ఇంత తిండి దొరకడం కష్టమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతేసి ఆస్తులు కూడబెట్టడం చూసి ఆవాక్కవుతున్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ పరిధిలోని జలమండలి జనరల్ మేనేజర్ ఇంట్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. రెడ్ హిల్స్ జలమండలి జనరల్ మేనేజర్ అనంత లక్ష్మి కుమార్ లక్ష్యంగా ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం ఆకస్మిక దాడులు చేపట్టారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8 విభిన్న ప్రాంతాలలో ఏకకాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. మల్లాపూర్‌లోని జీఎం కుమార్ స్వగృహంలో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ స్వయంగా రంగంలోకి దిగి ఈ తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు. జలమండలి జీఎం కుమార్



నివాసంతో పాటు ఆయనకు అత్యంత సమీప బంధువుల ఇళ్లలోనూ సోదాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తనిఖీల్లో అధికారులకు భారీ ఎత్తున నగదు పట్టుబడింది. ఇంట్లో కుప్పలుగా

- మిగతా 2వ పేజీలో





## దేశానికి ఆర్థిక ముప్పు

### ముందెన్నడూ చూడని సంక్షోభాన్ని చూస్తాం

- సంక్షోభం గురించే మోదీ పొదుపు మంత్రం
- ఉద్యోగులు, చిరువ్యాపారులు, రైతులు
- కుదుపులకు సిద్ధంగా ఉండాలి
- రాహుల్‌గాంధీ హెచ్చరికలు



తెలంగాణకు..

## చల్లని కబురు

### నైరుతి రుతుపవనాల ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్..

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

మండే ఎండతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండగా.. త్వరలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశముందని పేర్కొన్నారు. తెలంగాణలో గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పలు జిల్లాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు

- మిగతా 2వ పేజీలో



## కాంగ్రెస్ కు కొత్త రక్తం?

### పార్టీ.. ప్రభుత్వంలో మార్పులు..

### అధ్యక్షుడితో సహా మంత్రుల స్థాన చలనం.. రేవంత్ మార్క్ కనిపించేలా

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

కాంగ్రెస్ పార్టీలో భారీ ప్రక్షాళనకు తెరతీస్తోంది. పార్టీలో పీసీసీ అధ్యక్షుడితో సహా సమూల మార్పుల చోటు చేసుకుంటాయని తెలుస్తోంది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి మంత్రి వర్గ విస్తరణ జరుగలేదు. కీలక శాఖలు సీఎం వద్దనే ఉన్నాయి. త్వరలో మంత్రి వర్గంలో భారీ మార్పులు వస్తాయని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయంలో సీఎం రేవంత్ మార్క్ కనిపిస్తుండగా దానిని మరింతగా బలోపేతం

- మిగతా 2వ పేజీలో

# జలమండలిలో అవినీతి తిమింగలం

(మొదటి పేజీ తరువాయి)

పడి ఉన్న నోట్ల కట్టలను చూసి ఏసీబీ అధికారులే ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. స్వాధీనం చేసుకున్న నగదు అత్యధికంగా ఉండటంతో, దానిని ఖచ్చితంగా లెక్కించేందుకు అధికారులు ప్రత్యేకంగా క్యాష్ కౌంటింగ్ మెషీన్లను తెప్పించారు.

### రూ.100 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ..

జలమండలి మేనేజర్ అనంత లక్ష్మి కుమార్ నివాసాల్లో ఏసీబీ అధికారులు తనిఖీల్లో 100 కోట్ల (మార్కెట్ విలువ ప్రకారం ) ఆస్తులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మల్లాపూర్ తో పాటు బంధువుల నివాసాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఇంట్లో కోటి 10 లక్షల నగదుతో పాటు సుమారు కేజీ బంగారు ఆభరణాలు గుర్తించారు. లభ్యమైన డాక్యుమెంట్స్ ప్రకారం హైదరాబాద్ లో గేటెడ్ కమ్యూనిటిలలో 3 ఫ్లాట్స్.. 6 ఓపెన్ ఫ్లాట్స్ ఉన్నాయి. నిజామాబాద్ లో 3 ఎకరాల భూమి ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో భారీగా ఆస్తులు ఉన్నాయని ఏసీబీ అధికారులు గుర్తించారు. బ్యాంక్ లాకర్స్ ఓపెన్ చేసి అందులో ఏముందో చెక్ చేయనున్నారు. పట్టుబడిన ఈ భారీ నగదు, ఇతర ఆస్తుల వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లపై దర్యాప్తు బృందం ప్రస్తుతం ఆరా తీస్తోంది. ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు, లభించిన మొత్తం ఆస్తుల విలువ ఎంత అనేది సోదాలు ముగిసిన అనంతరం అధికారులు అధికారికంగా వెల్లడించనున్నారు. జీఎం కుమార్ స్థిర, చరాస్తుల వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# తెలంగాణకు.. చల్లని కబురు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నప్పటికీ వేడి మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ రాష్ట్ర ప్రజలకు ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. తెలంగాణలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. రుతుపవనాలు ఇప్పటికే బంగాళాఖాతం వైపు వేగంగా విస్తరిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. రుతుపవనాల ప్రభావంతో ఇవాళ, రేపు తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షాల సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈనెల 26 నాటికి నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉండగా.. నెలాఖరు నాటికి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వచ్చే వారం రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. అలాగే, వారంరోజుల తర్వాత కొన్ని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న ఎండల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పడుతుందని తెలిపింది. అయితే, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మాత్రం మరో మూడు రోజుల పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని సూచించారు. వర్షాల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద, భారీ హోర్డింగ్‌ల సమీపంలో నిలబడవద్దని అధికారులు హెచ్చరించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.

# మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

(మొదటి పేజీ తరువాయి)

కోల్‌కత్తా రూ. 109.70, చెన్నై రూ.104.49గా ఉన్నాయి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విధించే స్థానిక పన్నులు (వ్యాట్) ఆధారంగా ఒక్కో నగరంలో ఈ ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉంటాయి. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉందని...రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలో ఓఎంసీల రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెల్లడించారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయటం లేదు. తెలంగాణలో ఈ నెలలో నిన్నటి వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశామనీ, ఈ సీజన్‌కు ఇది సాధారణమని ఓఎంసీలు తెలిపాయి. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ విధానమైన డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) వ్యవస్థను అనుసరించాలని కోరుతున్నాయి.

# కాంగ్రెస్ కు కొత్త రక్తం?

(మొదటి పేజీ తరువాయి)

చేసుకునే దిశలో ఆయన అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నారు. అధిష్టానం కూడా సీఎం చెపుతున్న విషయాల పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. పలుమార్లు పార్టీ వ్యవహారాలపై, నాయకుల తీరుతెన్నులపై అధిష్టానానికి సీఎం వివరించినట్లు సమాచారం. కాగా ఈసారి మంత్రివర్గంలో భారీగా మార్పులు ఉండబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. సీనియర్లు సీఎంకు సహకరించడం లేదనే భావనతో ఈసారి వాటికి చెక్ పెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి విస్తరించబోయే మంత్రి వర్గంలో కొత్త వారికి చోటు కల్పించడంతో పాటు యంగ్ అండ్ డైనమిక్‌పై ప్రధానం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సీఎంకు యంగ్ అండ్ డైనమిక్ నేతలే ప్రభుత్వంలో ఉంటే మరింతగా కొత్తతరం ఆలోచనలతో ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

### సీనియర్లకు చెక్..

మంత్రివర్గంలో సీనియర్లుగా చెలామణి అవుతున్న వారిని మంత్రి వర్గం నుంచి ఉద్వాసన పలికేందుకు రంగం సిద్ధం అయినట్లు ఢిల్లీ పార్టీవర్గాల సమాచారం. ఇదంతా రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రక్షాళన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు తాను చెప్పిందే వేదంగా చేయాల్సిన మంత్రులు కొందరు తకరారు పెడుతున్నట్లు సమాచారం. దీంతో అనుకున్న విధంగా ప్రజాపాలన చేయడంలో కొంత ఇబ్బందులు వస్తున్నట్లు సీఎం అనుయాయులు అదిష్టానం వద్ద చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ప్రక్షాళన చేయడానికి అధిష్టానం సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే యువరక్తంలో కొత్త మంత్రి వర్గం ఏర్పాటు కాబోతోందని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా పీసీసీ మహేష్‌కుమార్ గౌడ్‌ను మార్చి కొత్తతరానికి బాధ్యతలు అప్పగిస్తానే ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీ కోసం పని చేసిన నాయకులకు గుర్తింపు నిచ్చి, పార్టీని కొత్తపుంతలు తొక్కించే నేతను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. అయితే సీఎంకు అనుకూలమైన కొత్త యువ నేతను పార్టీ సారథిగా ఎంపిక చేయాలని తర్జనభర్జనలు చేస్తున్నారు. అయితే సీఎం మనసులో యంగ్ నేతలు ఇద్దరు ఉన్నట్లు తెలిసింది. వీరు పార్టీ కోసం విస్తృతంగా పని చేశారని, తెలంగాణ ఉద్యమ సమయంలో పలుమార్లు జైళ్లకు వెళ్లారని, కష్టకాలంలో పార్టీ కోసం పని చేశారనే ట్రాక్ రికార్డ్ ఉందని విశ్వసనీయ సమాచారం. వీరిపై సీఎం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 వరకు ఒక కొలిక్కి వస్తుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పార్టీ ప్రక్షాళనతో పాటు మంత్రివర్గ ప్రక్షాళన కూడా జరుగనున్నదని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీలో కొత్త యువరక్తం నాయకత్వ బాధ్యతలు చేపట్టబోతున్నందుకు పార్టీ శ్రేణుల్లో కూడా ఉత్సాహం ఉరకలేసే అవకాశం ఉంది.



# పాలమూరు-రంగారెడ్డికి ప్రాధాన్యం

## వేగంగా భూసేకరణ పూర్తిచేయండి.. నిధుల విడుదలలో జాప్యం ఉండదు

## ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: పాలమూరు- రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఉమ్మడి జిల్లాల్లోని ఇతర ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణనూ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. ఈ జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో సీఎం మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులపై సమీక్షించారు. భూసేకరణకు నిధుల విడుదలలో జాప్యం జరగకుండా చూస్తామని హామీఇచ్చారు. ఇతర ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులనూ చెల్లిస్తామని స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రులను ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రూ.480 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ నిధులను నేరుగా (గ్రీన్‌ఛానల్ ద్వారా) ఇవ్వాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయగా. సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రధాన కాలువల పనులు చేపట్టాల్సి ఉందని పేర్కొనగా... అందుకు అవసరమైన భూసేకరణ, నిధులపై ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం సూచించారు. ఈ అంశంపై ఈ నెల 25న నాగర్‌కర్నూల్, 26న మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులు సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎత్తిపోతల్లో చేపట్టకుండా పక్కనపెట్టిన లక్ష్మీదేవిపల్లి జలాశయాన్ని నిర్మించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య కోరినట్లు తెలిసింది. కర్వెన జలాశయం కింద ప్రధాన కాలువను నిర్మిస్తే కోయిల్‌సాగర్ వరకు సాగునీరు అందుతుందని, దీని కిందనే ఎక్కువ ఆయకట్టు ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కోరినట్లు తెలిసింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు కేటాయిస్తే అసంపూర్తి పనులన్నీ పూర్తవుతాయని, అలానే శంకరసముద్రం జలాశయం ఆర్‌అండ్‌ఆర్ పనులు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంలో మరో 10 శాతం భూసేకరణ చేయాల్సి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల్లోని మొదటి దశ పంప్‌హౌస్‌లో మూడు మోటార్లే నడుస్తున్నాయని, మరో రెండింటిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. 2028 డిసెంబరు నాటికి 'పాలమూరు-రంగారెడ్డి' పూర్తయ్యేలా ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ భేటీలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, వి.శంకరయ్య, కృష్ణమోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

భారాస పదేళ్ల పాలనలో పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అక్కడి ప్రాజెక్టుల్లో పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పక్షం రోజుల్లో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల్లో పురోగతిపై రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

# బంధాలు ఉన్నతస్థాయికి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని మోదీ తేల్చిచెప్పారు. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని స్పష్టంచేశారు. ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో నియమాల ఆధారిత ప్రపంచ క్రమాన్ని బలోపేతం చేయడానికి భారత్, నార్డిక్ దేశాలు కలిసి పని చేస్తూనే ఉంటాయని వెల్లడించారు. ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా వివాదాల ప్రారంభ పరిష్కారానికి, శాంతి కోసం జరిగే ప్రయత్నాలకు మద్దతునిస్తూనే ఉంటామని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన పట్ల నిబద్ధత తమను సహజ భాగస్వాములను చేస్తోందన్నారు. గ్రీన్ టెక్నాలజీ భాగస్వామ్యంతో మొత్తం ప్రపంచానికి మంచి భవిష్యత్తును అందిస్తామని మోదీ పేర్కొన్నారు.

### మూడు దేశాల ప్రధానులతో భేటీ

ఐస్‌లాండ్, ఫిన్‌లాండ్, డెన్మార్క్ దేశాలతో క్లీన్ ఎనర్జీ, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, సుస్థిరాభివృద్ధి, డిజిటలీకరణ, కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సంబంధాలను బలపేతం చేసుకోవడంపై మోదీ చర్చించారు. ఆయన మంగళవారం ఆయా దేశాల ప్రధానమంత్రులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. భారత్, మూడు నార్డిక్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిపై చర్చించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్‌లో పర్యటించాలని మూడుదేశాల ప్రధానులను మోదీ ఆహ్వానించారు. ఐస్‌లాండ్, ఫిన్‌లాండ్, డెన్మార్క్ దేశాలతో సంబంధాలకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మోదీ ఉద్ఘాటించారు.

### ఇటలీకి పయనమైన మోదీ

ప్రధాని మోదీ నార్వే పర్యటన పూర్తిచేసుకొని మంగళవారం ఇటలీకి పయనమయ్యారు. నార్వే పర్యటన ఫలవంతంగా ముగిసిందని ఆయన 'ఎక్స్'లో పోస్టుచేశారు. పలు సమావేశాల్లో పాల్గొన్నానని, కీలక రంగాల్లో సహకారాన్ని మరింతగా పెంపొందించడానికి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు.

# దేశానికి ఆర్థిక ముప్పు

- ఉద్యోగులు, చిరువ్యాపారులు, రైతులు
- కుదుపులకు సిద్ధంగా ఉండాలి
- రాహుల్‌గాంధీ హెచ్చరికలు

న్యూఢిల్లీ, మే 19: భారత్ వైపు ఒక పెద్ద ఆర్థిక తుపాను దూసుకువస్తున్నదని, జీవితంలో ఇంతకముందున్నెడూ చూడని ఆర్థిక సంక్షోభం చూడబోతున్నామని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జోస్యం చెప్పారు. ఆర్థిక సంక్షోభం గురించి తెలిసే ఇటీవల ప్రధాని మోదీ దేశప్రజలకు పొదుపు మంత్రం వల్లెవేశారని అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ జిల్లా బచ్‌రావన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్రవ్యోల్బణం ముందెన్నడూ నమోదు కానంత నమోదవుతుందని అంచనా వేశారు. రానున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకునేందుకు యువత, రైతులు, చిరువ్యాపారులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భారతీయులు విదేశీ ప్రయాణాలు చేయవద్దని హితబోధ చేసిన ప్రధాని మోదీనే, ఇప్పుడు విదేశీ పర్యటనలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎవరూ బంగారం కొనవద్దని, ఎలక్ట్రిక్ వాహనాలు కొనాలని చెబుతూ ప్రధాని మాత్రం విలాసవంతమైన ఫ్లైట్లో విదేశాలకు ఎగిరిపోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పక్కా ప్రణాళికలు ఇంధన ధరలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సంక్షోభ సమయాల్లో కేంద్రం ప్రజల వైపు నిలబడదని, వారి అండదండలు ఖచ్చితంగా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీలకే ఉంటాయని దు య్యబట్టారు. ఉద్యోగులు, చిరువ్యాపారులు, రైతుల్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉందని, కానీ.. కేంద్రం మాత్రం ఉదాసీనతే ప్రదర్శిస్తూ వస్తున్నదని విమర్శించారు.

# రేవంత్‌ను ఊరిస్తున్న ఢిల్లీ పీఠం!

(మొదటి పేజీ తరువాయి)



కూడా జరిగింది. ఆ తర్వాత ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు కూడా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఒకస్థాయిలో ఆయన మాటంటే మాటేగా చెల్లుబాటు అయింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం జాతీయ రాజకీయాలను టార్గెట్ చేశారు. ఈ నేపథ్యంలోనే టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. బీఆర్ఎస్ ద్వారా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ప్రయత్నించి, చివరికి సొంత ఇలాకాలోనే పట్టు కోల్పోయారు.

### రేవంత్ సాధిస్తారా?

ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ ఆవిర్భావించిన తర్వాత పలువురు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పగా.. సీఎం రేవంత్‌రెడ్డి మొదటి విడతలోనే తన కలను స్పష్టం చేయడం అంటే సాహసమనే చెప్పాలి. 'నేను రెండు సార్లు సీఎంగా ఉంటాను, ఆ తర్వాతే జాతీయ రాజకీయాలకు వెళ్తాను' అని చెప్పడం ద్వారా ఆయన తన కేడర్‌లో స్థిరత్వాన్ని నింపాలని చూస్తున్నారు. పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజలు ముఖ్యమంత్రి దృష్టి పాలన మీద ఉందా లేక వ్యక్తిగత ఎదుగుదల మీద ఉందా అని ప్రశ్నించే అవకాశం ఉంది. అంతేకాకుండా, అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉండే కాంగ్రెస్‌లో అది సాధ్యమా అన్న చర్చ కూడా జరుగుతుంది.

రేవంత్ రెడ్డికి సొంత పార్టీలోనే బలమైన ప్రత్యర్థులు, సీనియర్లు ఉన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలంటే ఆయన కేవలం ప్రతిపక్షాలనే కాదు, పార్టీలోని ఇతర పవర్ సెంటర్లను కూడా అధిగమించాల్సి ఉంటుంది. అయితే, రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం అతిపెద్ద బలం. ఇవ్వన్నీ ఒకెత్తు అయితే, పాలనలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయడం, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఆయన రెండోసారి ముఖ్యమంత్రి కాగలరు. ఒకవేళ సంక్షేమ పథకాల్లో విఫలమైతే, 2034 లక్ష్యం అనేది కేవలం కలగానే మిగిలిపోతుంది. తెలంగాణ ప్రజలు ప్రాంతీయ సెంటిమెంట్ కు ప్రాధాన్యత ఇస్తారు. తమ సీఎం ఢిల్లీ పర్యటనలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ప్రజలు భావిస్తే, అది రాజకీయంగా పెద్ద డ్యామేజ్ కలిగిస్తుంది. రేవంత్ రెడ్డి జాతీయ నాయకుడిగా ఎదగాలంటే, ముందుగా తెలంగాణలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఒకవేళ తెలంగాణ ప్రజలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని భావిస్తే, రెండోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే ఉండదు. రేవంత్ రెడ్డికి బలమైన నెట్‌వర్క్, జాతీయ పార్టీ నేపథ్యం ఉన్న మాట వాస్తవమే అయినా.. రాజకీయాల్లో ప్రజా తీర్పు అత్యంత శక్తివంతమైనది. రేవంత్ రెడ్డి తన పాలనతో ప్రజలను మెప్పిస్తూ, ఢిల్లీ వైపు అడుగులు వేస్తేనే మెరుగైన ఫలితాలు సాధించగలరనేది ఎక్కువ మంది అభిప్రాయం.

# మరో నాలుగు రోజులు భగభగలు

## 8జిల్లాల్లో తీవ్ర వడగాడ్పుల ప్రభావం

## రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు భగ్గుమంటున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల మేర అధికంగా నమోదవుతున్నాయి. మరో నాలుగు రోజులు రాష్ట్రంలో ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ఆదిలాబాద్, జగిత్యాల, ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్లగొండ, పెద్దపల్లి, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల్లో తీవ్ర వడగాడ్పుల ప్రభావం ఉంటుందంటూ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సోమవారం రాష్ట్రంలోకెల్లా నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 45.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే పశ్చిమ మధ్యప్రదేశ్ నుంచి మధ్య మహారాష్ట్ర, మరత్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి ఏర్పడిందని తెలిపింది. అదేవిధంగా సోమవారం దక్షిణ కోస్తాంధ్ర తీర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని పేర్కొంది.

# వ్యర్థాల నిర్వహణతో తెలంగాణలో సర్క్యులర్ ఎకానమీ

## ఆ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సాయం అందించాలి

- స్వచ్ఛభారత్ సదస్సులో భట్టి

దిల్లీ: తెలంగాణలో వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయంగా చేపడుతూ సర్క్యులర్ ఎకానమీకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అయితే వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రం తగిన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా ఈ రంగంలో ఆధునిక మౌలిక సదుపాయాలు, శాస్త్రీయ శుద్ధి యూనిట్లు ఏర్పాటు చేసేందుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అధ్యక్షతన మంగళవారం ఇక్కడి విజ్ఞాన్‌భవన్‌లో ప్రారంభమైన రెండు రోజుల స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 జాతీయ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. "విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకోసం క్యూర్, ప్యూర్, రేర్ అన్న త్రిసూత్ర విధానాన్ని అనుసరిస్తున్నాం. రాష్ట్రాన్ని కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌లుగా విభజించి సమతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఘన వ్యర్థాల నిర్వహణను కేవలం చెత్త సేకరణకే పరిమితం చేయకుండా వాతావరణ మార్పులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పనలను దృష్టిలో ఉంచుకొని వ్యర్థాల నిర్వహణ చేపడుతున్నాం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పులను తెస్తున్నాయి. కొత్త నిబంధనలు చెత్త సేకరణను డంపింగ్ యార్డులకే పరిమితం చేయకుండా మూలంలోనే నాలుగు భాగాలుగా చెత్తను వేరుచేసి వికేంద్రీకృతంగా వాటి శుద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. దీనివల్ల సర్క్యులర్ ఎకానమీ సాధ్యమవుతోంది. రాష్ట్రంలోని కీలకమైన పట్టణ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోంది. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే శుద్ధి చేస్తున్నాం. పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీలోకి తీసుకొస్తున్నాం. ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ఠ స్థాయిలో మాత్రమే వ్యర్థాలు చేరేలా చూస్తున్నాం. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్‌యార్డ్, ఆటోనగర్ డంప్‌సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా శుద్ధి చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డంప్‌యార్డులను అభివృద్ధి కేంద్రాలుగా మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. జపాన్‌లోని కిటాక్యూషు నగర అభివృద్ధిని నమూనాగా తీసుకొని బండరావిర్యాల, సిద్ధాపూర్ ప్రాంతాల్లో ఎకోటౌన్‌ను ప్రతిపాదించాం" అని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కూడా పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లాలో వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేత

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 19(ప్రజాతీర్పు ):**

నిర్మల్ జిల్లా లో వరిధాన్యాం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం, మౌలిక వసతుల లేమి, తరుగు తేమ పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టి యుద్ధ ప్రాతిపదికన జిల్లాలో కొనుగోలు చేపట్టాలని కోరుతూ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసేలా అర్జున్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కి వినతి పత్రం అందజేయడం జరిగింది. బిజెపి రాష్ట్ర పార్టీ, బి జె ఎల్ పి నేత ఏలేటి మహేష్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, నిర్మల్ జిల్లా బిజెపి అధ్యక్షులు రితేష్ రాథోడ్ అదేశాల మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించడం జరిగింది. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, గన్ని బ్యాగుల కొరత, హమాలీలు లారీలు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పడకేసిందని అర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు.తరుగు తేమ పేరుతో దళారులు దోపిడీ చేస్తున్నారని, రైతు చెమటను తేమ పేరుతో కొలిచే ఈ దోపిడిని తక్షణమే అధికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోళ్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ నిరంతరం రైతుల పక్షాన పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ వినతిపత్రంపై స్పందించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా ఈనెల 30లోగా కొనుగోలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మేడిశెమ్మే రాజు, మహిళా నాయకురాలు అలివేలు మంగ,బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ బుర్ర రమేష్, నిర్మల్ పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుమ్మరి వెంకటేష్, పోలాస భరత్, నిర్మల్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు రామోజీ నరేష్, కునా శశాంక్, గంజీ రాజు, బీజేవైఎం జిల్లా నాయకులు కందుల హరీష్,అయిండ్ల సాత్విక్, టీకాజీ, ఏం శ్రీనివాస్, నేరల్లా సాయి, పట్టణ ప్రధాన కార్యదర్శి సోప్పరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## జగిత్యాల విద్యార్థికి ఉత్తమ పురస్కారం

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 19.**

జగిత్యాల జిల్లా కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్ష్మీపూర్ ఎస్ ఎస్ సి 2025–26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఉత్తీర్ణత 600 ల మార్కులకు గాను 565 మార్కులు సాధించిన నక్క అంజలి విద్యార్థిని మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార్ అందుకొంది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దెల సరోజన ను శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ విఠల్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎస్ రవీందర్ లు పాల్గొన్నారు.

## మంథని 108 అంబులెన్స్‌పై ఆకస్మిక ఆడిట్... సేవలపై సంతృప్తి వ్యక్తం

**మంథని, మే 19 (ప్రజాతీర్పు)**



మంథని పట్టణంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న 108 అంబులెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర అత్యవసర సేవల సంస్థ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఈఎంఆర్ఐ క్వాలిటి ఆడిట్ కంట్రోలర్ ఫయాజ్ ఆకస్మికంగా ఆడిట్ చేశారు. అత్యవసర అంబులెన్స్‌లో వినియోగిస్తున్న ఔషధాలు, అత్యవసర వైద్య పరికరాలు, వాటి పనితీరు, వివిధ రకాల ఆక్సిజన్ సిలిండర్ల నిర్వహణ, గత కొద్దిరోజులుగా అటెండ్ అవుతున్న కేసుల వివరాలు, జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమ్, వాహనం స్థితిగతులు, పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అంబులెన్స్ సేవల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 108 పెద్దపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ జంపాల కుమారస్వామి, మంథని 108 అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ లక్కిరెడ్డి వంశీధర్ రెడ్డి, పైలెట్ మల్లేష్ పాల్గొన్నారు.



## మంచిర్యాల జిల్లా బాట్రాజు సంఘం నూతన అధ్యక్షుడు గా చక్రదరి సురేందర్ రాజు ఎన్నిక

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 19**

తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం- మంచిర్యాల జిల్లా కమిటి 2026–2029 సంవత్సరంనకు గాను నూతన కార్యవర్గశీ ఏకగ్రీవ ఎన్నిక ప్రకటించనైనది. ఎన్నికల అధికారి ఱ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్న మాధవుని జీవన్ రాజు మరియు ఎన్నికల సహాయ అధికారి ఱ రాష్ట్ర కార్యదర్శి అడ్లూరి సత్యనారాయణ రాజు , ఎన్నికల పర్యవేక్షకులు మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి రవీందర్ రాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవ ఎన్నిక చక్రధరి సురేందర్ రాజును నిర్వహించడం జరిగింది.

# పుస్తక పఠనమే అజ్ఞానాన్ని చీల్చే ఆయుధం: శ్రీదాస్యం లక్ష్మయ్య

- సమతా గ్రంథాలయానికి అమూల్యమైన పుస్తకాలను విరాళంగా అందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు-
- పుస్తక సంస్కృతిని పెంచాలని దుర్గం ప్రమీల నగేష్ పిలుపు

**ఎన్టిపిసి, మే 19, (ప్రజా తీర్పు) :**



నేటి యాంత్రిక జీవనంలో, సోషల్ మీడియా ప్రభావంతో మనిషి జ్ఞానాన్ని పంచే పుస్తకాలకు దూరమవుతున్నాడని, అజ్ఞానాన్ని చీల్చి, విచక్షణను పెంచే ఏకైక ఆయుధం పుస్తక పఠనమేనని ప్రముఖ కవి, రచయిత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీదాస్యం లక్ష్మయ్య అన్నారు. మంగళవారం 'సమతా గ్రంథాలయంకు లక్ష్మయ్య దంపతులు తమ వ్యక్తిగత సేకరణలోని సుమారు 150కి పైగా విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదాస్యం లక్ష్మయ్య మాట్లాడుతూ, "ఉపాధ్యాయుడిగా నా జీవితకాలంలో సంపాదించిన ఆస్తి ఈ పుస్తకాలే. వీటిని నా గదిలోనే ఉంచుకుంటే ఒకరిద్దరికే పరిమితమవుతాయి. అదే గ్రంథాలయానికి ఇస్తే నలుగురికి జ్ఞానాన్ని పంచుతాయి. సమతా గ్రంథాలయం ద్వారా ఈ పుస్తకాలు విద్యార్థులకు, చదువుపై ఆసక్తి ఉన్న సామాన్యులకు అందుబాటులో ఉండటం నాకు ఎంతో తృప్తినిస్తోంది" అని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు కేవలం వినోదాన్ని మాత్రమే ఇస్తాయని, పుస్తకాలు మాత్రం ఆలోచనను, జీవితాన్ని నిర్మిస్తాయని ఆయన గుర్తుచేశారు. సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు దుర్గం ప్రమీల నగేష్ మాట్లాడుతూ, సమాజ మార్పు కోసం నిరంతరం తపించే శ్రీదాస్యం లక్ష్మయ్య దంపతులు తమకు పుస్తకాలను అందించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. "నిరక్షరాస్యతను, మూఢనమ్మకాలను రూపుమాపి, చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో గ్రంథాలయాలు కీలకం. లక్ష్మయ్య దంపతులవంటి మహనీయులు అందించిన ఈ పుస్తకాలు మా గ్రంథాలయానికి పెద్ద ఆస్తి. వీటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలి" అని ఆమె కోరారు.?సామాజిక సేవ, సాహిత్య రంగాల్లో శ్రీదాస్యం లక్ష్మయ్య దంపతుల నిరంతర కృషిని ప్రమీల కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య సతీమణి ఉపాధ్యాయుని గోదాదేవి సమత ఫౌండేషన్ చైర్మన్ దుర్గం నగేష్, పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్‌తో రాజకీయం వద్దు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 19.**

విద్యార్థుల భవిష్యత్ తో రాజకీయం చేయడం నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కు తగదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతే రోడ్డు పార్టీ కార్యాలయం లో ఎమ్మెల్యే మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగిత్యాల ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతున్నారన్నారు. రాజ్యాంగం కల్పించిన ఫెడరల్ స్ఫూర్తి లో భాగంగా ముఖ్యమంత్రి ప్రధానమంత్రిని రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులు కోరడంలో తప్పేముందని, నిధులు కోరితే ముఖ్యమంత్రి ని బిచ్చగాడు అని అంటారా? ఇలాంటి వాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. 5 ఎండ్ల లో తెలంగాణ రాష్ట్రం జి ఎస్ టి రూపం లో కేంద్రానికి 2 లక్షల కోట్ల పైగా ఇస్తే కేంద్రం మాత్రం 85 వేల కోట్ల నిధులు ఇచ్చిందన్నారు.కేంద్రీయ విద్యాలయం ఏర్పాటులో ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ఎంపీకి బాధ్యత ఉంటుందన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రిని కేంద్రీయ విద్యాలయం స్థలం విషయంలో కలవాల్సిన బాధ్యత ఎంపీ గారికి ఉందని, నేను అనేక సార్లు కలిసి 5 ఎకరాలు కేటాయించాలి అని వినతి పత్రాన్ని అందజేశానన్నారు.కేంద్రీయ విద్యాలయం స్థలం సేకరణ లో ఎమ్మెల్యే అసమర్థ అంటే ....నేను జగిత్యాల నియోజవర్గానికి అవసరమైన జాతీయ రహదారులు,బ్లాక్ స్పాట్ రోడ్డులు,వంతెనలు,జగన్నాద్ పూర్ బ్రిడ్జి నిధులు మంజూరు చేయాలని ఎంపీ అరవింద్ ,కేంద్ర మంత్రులకు వినతులు ఇస్తే ఇప్పటి సమాధానం లేదాని ఇది మీ అసమర్థత కాదా ప్రశ్నించారు.చల్గల్ లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చిత్తశుద్ధి తో ఉన్నానని వాలంతరి అనేది స్వయం ప్రతిపత్తి సంస్థఅని సంస్థ అభివృద్ధి పై ఎప్పుడైనా ఆలోచన చేశారా అని మండిపడ్డారు.స్థలం సాకుతో కేంద్రీయ విద్యాలయం తరలించే ఆలోచన చేయవద్దన్నారు. జగిత్యాల నియోజకవర్గం పై ఎంపీ కి కనీస అవగాహన లేకుండా అహంకారం తో మాట్లాడుతున్నారన్నారు. గడిచిన 6 నెలల్లో ఖీజ× ద్వారా ఎంత ధాన్యం సేకరణ చేశారో శ్వేత పత్రం విడుద చేయాలని ఎంపీని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు నందయ్య, మున్సిపల్ చైర్పర్సన్ వాణి శ్రీనివాస్, గిరి నాగభూషణం, బండ శంకర్, కొత్త మోహన్ తదితరులు ఉన్నారు.



## డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

- ఎల్లారెడ్డిపేట మండలంలో కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ.
- మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు.

**ఎల్లారెడ్డిపేట, మే 19 (ప్రజా తీర్పు)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ మహేష్ బిగితే ఆదేశాల మేరకు మంగళవారం రోజు పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.



## కోఆప్షన్ ఎన్నికల్లో పంతం నెగ్గించుకున్న ఎమ్మెల్యే పటేల్

- ఎన్నికైన ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు బిజెపి మద్దతు దారులే

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 19**



భైంసా మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పంతం నెగ్గించుకున్నారు. మొదట్లో జరిగిన మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికల్లో బిజెపి కౌన్సిలర్ ను తప్పు దోవ పట్టించడంతో అప్పట్లో ఎన్నిక రసబాసాగా మారి ఎన్నిక వాయిదా పడగా, మంగళవారం జరిగిన మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో మూడు స్థానాలకు ఎన్నికలు జరగగా మూడు కోఆప్షన్ పదవులు మున్సిపల్ చైర్మన్ మద్దతు దారులు దక్కించుకున్నారు. దీంతో నాలుగు కోఆప్షన్స్ స్థానాల్లో మూడు బిజెపి మద్దతు దారులు కైవసం చేసుకున్నారు. ఎన్నిక ప్రారంభం కావడంతో ఆరుగురు బిజెపి కౌన్సిలర్లు, ఏడుగురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో,ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎంఐఎం కౌన్సిలర్లు గైరాజరవడంతో,కోఆప్షన్ ఎన్నిక ఏకపక్షం అయింది. అనుకున్న స్థానాలు లేకపోయినప్పటికీ ఎంఐఎం పార్టీ కో ఆప్షన్,మెంబర్ల ను ద క్కించుకోవడానికి ఎత్తులు వేయడం,పలు ఆరోపణలు చేసినప్పటికీ ఎమ్మెల్యే పటేల్ ముందు ఎలాంటి పాచికలు పారలేదు. మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి నేత్రుత్వం లో కౌన్సిలర్ లు హైకోర్ట్ కు వెళ్లగా ఎన్నిక జరిగింది. ముగ్గురు కోఆప్షన్ సభ్యుల ఎన్నిక,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గా తోట లింగురాం, ముజీబ్ అహ్మద్,అల్లకొండ కవిత ఎన్నికయ్యారు. ఇందులో ఇద్దరు తోట లింగురాం,ముజీబ్ హైమద్ లు గతం లో మున్సిపల్ వైస్ చైర్మన్ లుగా పదవులు చేపట్టిన వారే.అల్లకొండ కవిత గతంలో కౌన్సిలర్ గా పనిచేశారు.వీరికి నియామక పత్రాలను సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్,ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్, మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి, కమి షనర్ లింగయ్య నియామక పత్రాలను అందజేశారు.

### మున్సిపల్ కార్యాలయం ముందు మిన్నంటిన సంబరాలు

కో ఆప్షన్ ఎన్నికల్లో,బిజెపి మద్దతు దారులు ముగ్గురు కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నిక కావడంతో మున్సిపల్ కార్యాలయం ముందు సంబరాలు మిన్నంటాయి. బిజెపి నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అభిమానులు, టపాసులు పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు.హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటు నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వారితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

### అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు జాబీర్ హైమద్‌ను హెచ్చరించిన మున్సిపల్ చైర్మన్

తమ నేత ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ హైమద్ ను హెచ్చరించారు. కో ఆప్షన్ ఎన్నిక ముగిసిన అనంతరం అయన మీడియా తో మాట్లాడారు. మరో మారు ఇలాంటి ఆరోపణలు చేస్తే తగిన రీతిలో సమాధానం చెబుతామన్నారు.గతంలో తప్పు దోవ పట్టించి ఎం.ఐ. ఎం. పార్టీ ఒక కో ఆప్షన్ స్థానాన్ని దక్కించుకున్న విషయం లో న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

# అక్రమంగా పశువులను తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం

### మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 19**



రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా మంచిర్యాల జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ తెలిపారు.బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పోలీస్ అధికారులతో కలిసి సందర్శించి,చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో అక్రమ జంతు రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పశువుల సంతలు, బక్రీద్ పండుగ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరు తదితర అంశాలపై అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా చట్టవిరుద్ధంగా ఆవులు,దూడలను అక్రమంగా రవాణా చేయడం,వధించడం పూర్తిగా నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద 24/7 నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు కఠినంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు.పశువుల అక్రమరవాణా, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రతి పండుగ సందర్భంగా ప్రజలు పరస్పరం మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీసీపీ ఆకాంక్షించారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర వైపు నుంచి అక్రమ ధాన్యం (వడ్లు) రవాణా జరగకుండా వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహించాలని ఒక రాష్ట్రం నుంచి వచ్చినట్లయితే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. డీసీపీ వెంట జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు కోటపల్లి ఎస్సై రాజశేఖర్ , భీమారం ఎస్సై రాజేందర్లు లు ఉన్నారు.



## బయ్యారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్ .

**(పగడాల రామారావు ప్రజా తీర్పు బయ్యారం మండల ప్రతినిధి)మే 19**

బయ్యారం స్థానిక మండల కేంద్రంలోనిపోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయ గదులు, సిబ్బంది పని విధానాన్ని పరిశీలించారు. స్టేషన్‌లో నిర్వహణ, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికఎస్ఐ ప్రశాంత్‌ను అడిగి స్టేషన్‌లో సిబ్బంది బలం, విధుల పంపిణీ, పని తీరు తదితర అంశాలపై సమాచారం సేకరించారు. సిబ్బంది పనితీరును మరింత మెరుగుపర్చాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల వారీగా పర్యటనలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. అలాగే గ్రామ పోలీస్ అధికారులు (విపిఓలు) చురుకుగా పనిచేయాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వేసవి కాలంలో చోరీల నివారణకు జాగ్రత్తలు సూచించాలని తెలిపారు. జిల్లాలో గంజాయి నిర్మూలన చర్యలను మరింత వేగవంతం చేసి, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు.

## ఏఐ, లైఫ్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ

### బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల కార్యక్రమం

**పెద్దపల్లి ప్రతినిధి, మే 19 (ప్రజా తీర్పు):**

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), లైఫ్ స్కిల్స్‌పై నాలుగు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఈ శిక్షణను మే 27 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, ఇంటర్, డిప్లమా లేదా డిగ్రీ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పని దినాల్లో కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో స్టడీ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 08782-268686 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.




## పినిరెడ్డిగూడెం లో సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా సుందరయ్య వర్ధంతి

### సుందరయ్య పోరాట జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి.) మే 19**

గార్ల: దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మత, మాజీ పార్లమెంట్ సభ్యులు పుచ్చల పల్లి సుందరయ్య జీవిత చరిత్ర నేటి యువత కు ఆదర్శం అని సిపిఎం రాష్ట్ర నాయకులు పి. సోమయ్య అన్నారు. సిపిఎం అగ్రనాయకులు పుచ్చల పల్లి సుందరయ్య 41వ వర్ధంతి ని మంగళవారం స్థానిక మండల పరిధిపినిరెడ్డిగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామం లో రెడ్ కవాతూ ప్రదర్శన చేసి,4 సెంటర్ లలో జెండా లు ఎగురా వేశారు. అనంతరం సుందరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో సీఐటీయూ రాష్ట్ర కొశాధికారి వంగూరి రాములు,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి. శ్రీనివాస్, మండల నాయకులు వి. వెంకటేశ్వర్లు, యం నాగమణి, కె. ఈశ్వర్ లింగం,సిహెచ్. ఎల్లయ్య, టి.రమా, సి హెచ్. మౌనిక,వార్డు సభ్యులు జి. సీతారాం,బి. ఝాన్సీ, నాయకులు వి. పద్మ,బి. నరేష్,బి. శివకృష్ణ,గ్రామ నాయకులు,రెడ్ స్టార్ యూత్ సభ్యులు,కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు ఉన్నారు.



## ఫాగింగ్ చేయండి.. దోమలను నిర్మూలించండి

### మురికి కాలువల అంతరాలను తొలగించాలి

**పగడాల రామారావు. ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) మే 19**

గార్ల ... స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోవిజృంభిస్తున్న దోమలను నియంత్రించేందుకు స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఫాగింగ్ చర్యలను చేపట్టాలని సర్వత్ర ప్రజలు కోరుతున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో దోమల సమస్య రోజు రోజుకు శృతి మించుతూ స్వైర విహారం చేస్తున్నాయని, వాటిని నియంత్రించి దోమ కాటు నుంచి కాపాడాలని ఆ నోట ఈ నోట జనాలు వ్యాఖ్యానిస్తున్నారు . దోమల బెడద నుండి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్న, స్థానిక మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు గ్రామపంచాయతీలో కొన్ని చోట్ల చెత్తాచెదారం పేరుకుపోయి, నీరు నిలువ ఉండటం వలన దోమలు పెరగటం , మురుకు నీరు వలన దుర్గంధం వెదజల్లుతున్నదని దీంతో చిన్న పెద్ద అనే తేడా లేకుండాటైఫాయిడ్ మలేరియా జ్వరాలు ,ఇతర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి, అవి వ్యాప్తి చెందకుండా చెత్తను , మురుగునీటిని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొనివెంటనే తొలగించాలని, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలనిదోమల నివారణ మందులు (ఫాగింగ్) పిచికారీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్యపై స్థానిక మేజర్ పంచాయతీ పాలకవర్గం, సంబంధిత అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొనుగోలు చేసిన వరి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 19.**



జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం పెగడపెల్లి మండలం నంచర్ల, దేవి కొండ, రాం నగర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎండపెల్లి మండల కేంద్రంలోని వాయుపుత్ర రైస్ మిల్ మరియు గుల్ల కోట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను, మిల్లర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డి సి ఎస్ ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి యువకుడి సైకిల్ యాత్ర

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 19**



దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి,ప్రధానమంత్రికి మద్దతుగా నిర్మల్ జిల్లాకు చెందిన ఓ యువకుడు చేపట్టిన మూడు రోజుల సైకిల్ యాత్రకు స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.పెంచికల్ పాడ్ గ్రామానికి చెందిన సాయి సూర్యవంశీ,బీజేపీ మండల కార్యదర్శి,పెంచికల్ పాడ్ నుంచి మహిష వరకు ఈ యాత్రను,ప్రారంభించారు.యాత్ర తొలి

రోజువిజయవంతంగా పూర్తయింది.దేశాభివృద్ధి, యువతలో చైతన్యం, మరియు జాతీయ భావన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సైకిల్ యాత్రను చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.మార్గమధ్యంలో పలువురు గ్రామస్తులు యాత్రికుడిని అభినందించి మద్దతు తెలిపారు.యాత్ర రెండో రోజు కార్యక్రమం మంగళవారం కొనసాగనుంది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా యాత్రికుడు మాట్లాడుతూ,దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, యువత దేశం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



## రంగాపూర్ ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం

- మొక్కజొన్న నిల్వకు అదనపు ఏర్పాట్లు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి, మే 19 (ప్రజా తీర్పు):**

జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న నిల్వ కోసం అదనపు గోదాం సౌకర్యాలను సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గల ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మంగళవారం కలెక్టర్ రంగాపూర్‌లోని ధాన్యం గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి బుధవారం నుంచి రంగాపూర్ ఐజి గోదాంకు మొక్కజొన్న తరలింపు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వ కొరకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 19(ప్రజాతీర్పు ):**



జిల్లాలో ధాన్యం నిల్వ చేయుటకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే గోదాములకు తరలించాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా, ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉంటే, ఆ ప్రదేశాలు గుర్తించి ధాన్యం అక్కడికి తరలించాలని వివరించారు. ధాన్యం నిరంతరాయంగా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, తగినంత మంది హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బోరు పాయింట్ ప్రారంభోత్సవం

**ఎల్లారెడ్డిపేట, మే 19 (ప్రజా తీర్పు)**

ఎల్లారెడ్డిపేట మండలం కిష్టు నాయక్ తండా గ్రామ సర్పంచ్ శ్రీమతి నిర్మల సురేష్ నాయక్ గ్రామంలో నీటి ఎద్దడి ఉందని కేంద్ర మంత్రివర్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకవెళ్లగా వెంటనే ఎంపీ నిధుల నుండి రెండు లక్షల రూపాయలతో బోరు మరియు మోటారు మంజూరు చేయడం జరిగింది. కొబ్బరికాయ కొట్టి బోర్ పాయింట్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ పాలకవర్గం, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి,మండల అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి,దాసరి గణేష్,కృష్ణ హరి, యాదగిరి బాలకృష్ణ, కార్యకర్తల,నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తిగా నిర్మూలించాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 19(ప్రజాతీర్పు ):**

జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక రీచ్ లను గుర్తించాలన్నారు. అక్రమ ఇసుక త్రవ్వకాలని పూర్తిస్థాయిలో నివారిస్తామని చెప్పారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, భూగర్భ జల అధికారి శ్రీనివాస బాబు, డిపిఓ శ్రీనివాస్, రాయల్టీ ఇన్స్పెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతి వేగంగా చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి,వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 19**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో ధాన్యం దిగుమతి వేగంగా చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం లో గల సుముఖ గోదాము, జయలక్ష్మి రైస్ మిల్ లను మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు సి ఎం ఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 19**

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన వరి ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేట లో గల అంబికా సాయి రైస్ మిల్లు, హాజీపూర్ మండలం నర్సింగాపూర్ లో గల రాజరాజేశ్వరి గోదాము, కాసిపేట మండలంలోని ఏ.ఎం.సి. గోదాములను ఆయా మండలాల తహసిల్దార్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపునకు సరిపడా లారీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులు, గోదాముల వద్ద ధాన్యం దిగుమతికి వేచి ఉన్న లారీల నుంచి వరి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, అందుకు అనుగుణంగా హమాలీల సంఖ్య పెంచుకోవాలని తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేసి జిల్లాలో కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మాన

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట )మే 19**



అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జలపతి రెడ్డి ఫంక్షన్ హాల్లో పదో తరగతి టాపర్ల సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బండారి నర్సయ్య తెలిపారు.మండలంలోని అన్ని పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని టాపర్లందరూ బుధవారం సాయంత్రం 7 గంటలకు హాజరుకావాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమానికి అలయన్స్ ఇంటర్నేషనల్ మెంబర్, అలయన్స్ ట్రస్టు చైర్మన్ డా. ఎలగందుల శ్రీనివాస్, అలయన్స్ జిల్లా గవర్నర్ కున్జెర్ల మహేష్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను సన్మానిస్తారని తెలిపారు

# ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 19**



రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల, షెట్ పల్లి, కుందారం, గంగిపల్లి గ్రామపంచాయతీలను పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. టేకుమట్లలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన లారీలను వెంటనే సమకూర్చాలని సంబంధిత రవాణా కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని, చెత్త సేకరణ సమయానికి నిర్వహించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్దేశిత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని, ఆ దిశగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. షెట్పల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, హమాలీలు, లారీల సమన్వయంతో ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు కుందారం గ్రామంలోని ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. పనులు నాణ్యతతో చేపట్టడంతో పాటు కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక మహిళ తన భర్త మరణించడంతో ఉపాధి హామీ పథకం కూలి డబ్బులు బ్యాంక్ ఖాతాలో నిలిచిపోయాయని, ఇప్పించాలని కోరగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి బాపు లను ఆదేశించారు. గంగిపల్లి గ్రామపంచాయతీని సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రత, చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు. చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి, ఏపీఎం సంతోష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 19(ప్రజాతీర్పు ):**

జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారి జిల్లాలో ఇప్పటి వరకు పూర్తిచేసిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అన్నారు. అందుబాటులో లేని రైతులకు సంబంధించి వివరాలను వివిధ మార్గాల్లో అన్వేషించాలని సూచించారు. రిజిస్ట్రీ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సంబంధమైన ఇబ్బందులు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మొత్తం ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడ గోశాలకు వెలుగు శేఖర్ 111 గడ్డి కట్టల బహూకరణ

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే19**

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం గాదేపల్లి గ్రామానికి చెందిన వెలుగు శేఖర్ గత నాలుగు సంవత్సరాలుగా వేములవాడలోని గోశాలకు ప్రతి సంవత్సరం 111 గడ్డి ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా ఈరోజు 111 గడ్డి కట్టలను గోశాల నిర్వాహకులకు అందజేయడం జరిగింది. వెలుగు శేఖర్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో పంటలు మంచిగా పండడంతో గోశాలకు గడ్డిని తీసుకురావడం జరిగింది అని అన్నారు. గడ్డి కట్టలు లోడ్ చేసి నా వెంట వచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు.



# పార్లమెంట్ కు సైకిల్‌పై వెళ్లిన ఆదర్శ నేత సుందరయ్య

**మంథని, మే 19 (ప్రజాతీర్పు)**

మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో ఉపాధి కూలీల మధ్య కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, స్వీట్లు పంపిణీ చేశారు. సభలో వ్యవసాయ కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ..సుందర య్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికి తన చివరి శ్వాస వరకు అణగారిన ప్రజల కోసం పోరాడిన గొప్ప ఉద్యమకారుడని అన్నారు. దళితులకు నీళ్లు ఇవ్వని కాలంలో తన బావి నుండి వారికి నీళ్లు ఇచ్చి మంచినీటి హక్కుల కోసం పోరాటం చేశారని తెలిపారు. ఉద్యమాలకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ పాటించిన ఆదర్శవంతుడని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని, భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి బాటలు వేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. పార్లమెంట్ కు సైకిల్‌పై వెళ్లి సాధారణ జీవన విధానంతో ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారని, కార్మికులు, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడటమే సుందరయ్యకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏల్పుల సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఇసుక తవ్వకాలు ఆపాలని కలెక్టరుకు ఫిర్యాదు

**చిగురుమామిడి మే 19 ప్రజా తీర్పు**



చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామ పరిధిలోని మోయతుమ్మెద వాగులో ఎఫ్ టిఎల్ పేరిట ఇసుక తవ్వకాలు ఆపాలని రామంచ గ్రామ సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి జిల్లా కలెక్టరుకుప్రజా వాణిలో ఫిర్యాదు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు లోయర్ మానేర్ డ్యామ్ సీల్డ్ పూడిక తీసే కార్యక్రమాన్ని చేపట్టి కాంట్రాక్టురుకు అప్పగించిందని కానీ సదర్ కాంట్రాక్టర్ డ్యాం అంతర్భాగంలో సీల్డ్ ఇసుక పూడిక తీయాల్సి ఉండగా తమ గ్రామ శివారు పరిధిలోకి చొచ్చుకొని వచ్చి ఇసుక తవ్వకాలు చేస్తున్నారని ఆ ప్రక్రియ వెంటనే ఆపాలని కోరారు.ఇసుక తవ్వకాలు చేపట్టడం ద్వారా తమ గ్రామ రైతుల వ్యవసాయ బావుల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత మార్చి నెలలో బావుల్లో నీరు మూడు మీటర్ల లోతులో ఉన్నాయని ఏప్రిల్ నెలలో 8 మీటర్ల లోతు వరకు నీటి మట్టం తగ్గిందన్నారు.ఈ అక్రమ ఇసుక తవ్వకాలతో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని వేసవిలో గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సంబధిత ఇరిగేషన్,రెవెన్యూ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని,తమ గ్రామ పరిధి వాగులోని ఇసుక తవ్వకాలు నిలిపివేయాలన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ పై బిఆర్ఎస్ ఆరోపణలు

## హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి

**హుస్నాబాద్ మే 19 ప్రజా తీర్పు**



నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్ల అంశంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో మున్సిపల్, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.మంత్రి పొన్నం ప్రభాకర్‌పై “ఫోటోలకు ఫోజులిస్తున్నాడు” అంటూ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.ఇప్పటివరకు 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం, 40 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని తెలిపారు. రైతులను దళారీ వ్యవస్థ నుంచి కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. మంచి పనులను చెడుగా చూపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, సింగిల్ విండో, మున్సిపల్, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: ప్రణవ్

- కాంగ్రెస్ అంటే రైతు ప్రభుత్వం
- రైతులను అన్ని విధాలుగా అందుకుంటున్నాం.
- జమ్మికుంట మార్కెట్ లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వొడితల ప్రణవ్.

**జమ్మికుంట మే 19 ప్రజాతీర్పు**



కాంగ్రెస్ అంటే రైతు ప్రభుత్వమని,రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.మంగళవారం రోజున జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి సందర్శించారు.రైతులతో కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,5 మండలాలు కలిపి జమ్మికుంటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని,రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని తెలిపారు.ఇప్పటివరకు మార్కెఫేడ్ ద్వారా సుమారు 72,500ల బస్తాలు,36,250 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేశామని,సోమవారం ఒక్కరోజే 10 వేల బస్తాల మక్కలు కొనుగోలు చేశామని తెలిపారు.రానున్న రెండు,మూడు రోజుల్లో ఇక్కడున్న ముక్కలు పూర్తిగా కొనుగోలు చేసి,గోడౌన్స్ కి తరలించిన తరువాత మరల మార్కెట్ లో కొనుగోలు సజావుగా అయ్యేట్టు చూస్తామని తెలిపారు.రైతులెవరూ ఆందోళన చెందవద్దని మీ వెంట ప్రభుత్వం అధికారులు ఉన్నామని తెలిపారు.అనంతరం మార్కెఫెడ్,జమ్మికుంట వ్యవసాయ పాలకవర్గంతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.మక్కలు త్వరగా కొనుగోలు అయ్యేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాముల గౌడ్

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే 19**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం లోని మద్దులపల్లి, నందగిరి, ఐతుపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కడారి తిరుపతి మరియు స్థానిక సర్పంచులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భనలో ఆయన రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న విధానాలను పరిశీలించారు. రైతులు తమ ధాన్యం సమయానికి విక్రయించుకునేలా, ఎటువంటి ఆలస్యం లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ: రైతులు ఇబ్బంది పడకుండా, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా సమయానికి ధాన్యం కొనుగోలు జరగాలని సూచించారు. – ప్రభుత్వ సంకల్పం రైతు సంక్షేమమే అని, అందుకు అనుగుణంగా మార్కెట్ కమిటీ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. రైతుల ధాన్యం నిల్వలు ఆలస్యం కాకుండా, తక్షణమే కొనుగోలు చేసి చెల్లింపులు జరగాలని ఆయన స్పష్టం చేశారు.

## రికార్డు స్థాయికి పవర్ డిమాండ్



ఎండలు మండిపోతున్న క్రమంలో సోమవారం దేశంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదైంది. ఒక పక్క వేడి గాలులు, ఉక్కపోత, తీవ్ర వేడి కారణంగా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వంటి విద్యుత్ ఉపకరణాల వాడకం అత్యధికం కావడంతో ఒక్క రోజే 257.37 గిగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైందని కేంద్ర విద్యుత్ శాఖ వెల్లడించింది. ఇది ఈ ఏడాది ఏప్రిల్ 25న నమోదైన 256.11 గిగావాట్ల కన్నా అధికమని తెలిపింది. ఈ వేసవిలో అత్యధిక విద్యుత్ వినియోగం 270 గిగావాట్లకు చేరుకోవచ్చునని పేర్కొన్నది.



## డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిశీలించిన చైర్ పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యా రాణి- రాజా రమేష్

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 19**

క్యాతనపల్లి మున్సిపాలిటీ 17వ వార్డ్ విద్యానగర్ లో డ్రైనేజీ వల్ల స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానిక ప్రజలు తెలుపగా అక్కడికి వెళ్ళి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సరిగ్గా లేకపోవడం వల్ల లీకేజీ అవుతుందని గమనించి వెంటనే మరమ్మతు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ లీకేజీ అవ్వడం వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని అలాంటివి తలెత్తకుండా ఉండాలంటే పారిశుద్ధ్య పనులను మరింత మెరుగుపరచాలని సూచించారు. త్వరలో మనకు మరికొంత మంది కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వస్తారని వారు వచ్చాక ప్రతి వాడలో రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్స్ అన్ని పరిశీలించి మున్సిపాలిటీ నుండి మరమత్తులు చేపిస్తామని తెలిపారు. అదే విధంగా ప్రజలను కూడా చెత్త వారి చుట్టుపక్కల ఉన్న కాలి ప్రదేశాలలో వేయవద్దని వేడుకున్నారు. ప్రజల సలహా మేరకు త్వరలో మరికొన్ని చెత్త డబ్బాలు అక్కడక్కడ ఏర్పాటు చేపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామిడి కుమార్, యూత్ నాయకులు లక్ష్మీకాంత్, మణి, నవీన్, మున్సిపాలిటీ సిబ్బంది సానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్ మరియు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సంతోష్, వార్డ్ ప్రజలు సౌజన్య, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా

**అక్కన్నపేట మే 19 ప్రజా తీర్పు**



గంజాయి, మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అమ్మిన విక్రయించిన కఠిన చర్యలు తీసుకోబడతాయని అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం గంజాయి మరియు మత్తు పదార్థాల నివారించడంలో భాగంగా అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరవెల్లి, గోవర్ధనగిరి వివిధగ్రామంలో ఉన్న కిరాణా షాపులు, టీ కొట్టులు, అనుమానాస్పద ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ.... అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరవెల్లి, గోవర్ధనగిరి ఆయా గ్రామంలో డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల పై నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా లేదా అక్రమంగా రవాణా చేసినా, పాన్ షాపుల్లో ఇతర షాపుల్లో అమ్మితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాలు క్రయవిక్రయాలు జరిపితే డయల్ 100 లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

### చిగురుమామిడి ఎస్సై పృథ్వీధర్

**చిగురుమామిడి మే 19 ప్రజా తీర్పు**

మద్యం సేవించి వాహనాలు నడపవద్దని చిగురుమామిడి ఎస్సై పృథ్విధర్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని సుందరగిరి – హుస్నాబాద్ ప్రధాన రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఉన్న ద్విచక్ర వాహనదారులకు ఫైన్ లు వేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పదేపదే పోలీసులు చెబుతున్నప్పటికీ పెడచెవిన పెడుతున్న వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించవలసి వస్తుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, ఇంటి వద్ద వేచి చూసే కుటుంబ సభ్యుల కోసమైనా క్షేమంగా గమ్యాన్ని చేరుకునేటట్లు వాహనదారులు నడుచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి, వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల ఉపేక్షించబోమని హెచ్చరించారు.



## ఏపీ పర్యటనకు బయలుదేరిన తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై కమిటీ

- గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం పై అధ్యయనం చేయనున్న కమిటీ

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 19.**

గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పన కొరకు తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి ఆంధ్ర ప్రదేశ్ లోని విజయవాడకు అధికారిక పర్యటనకు బయలుదేరింది. సీఎం ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ యాత్రను ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి, కమిటీ ఛైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్ లు ఈ బృందానికి నాయకత్వం వహించారు. కాగా ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 20, 21వ తేదీలల్లో పర్యటించి.. గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న కార్యక్రమాలపై అధ్యయనం చేయనుంది. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్లు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు లతో పాటు సాయిరెడ్డి, శేఖర్ గౌడ్, వాలంటీర్ కర్రి పద్మారాణి, ప్రొఫెసర్లు జునుగురు శ్రీనివాస్, విజయ్ కొర్రా, ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలంపల్లి సురేష్ కు ఘన సన్మానం

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా) మే 19**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మామ సూదిని పద్మా రెడ్డి, తెలంగాణ గ్రామపంచాయతీ ట్రైబ్యునల్ చైర్మన్ సూదిని రాం రెడ్డి మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆలంపల్లి సురేష్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం మల్కాజ్ గిరి లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో లో నిర్వహించారు. సంఘ సభ్యులు, ప్రముఖులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదిని రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి అలంపల్లి సురేష్ మరింత కృషి చేసి సంఘాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే సూదిని పద్మారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో యువ నాయకత్వం ఎంతో అవసరమని, మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం అలంపల్లి సురేష్ ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## ప్రైవేట్ పార్ట్‌లో హాక్సా బ్లేడ్ చొప్పించి.. గర్భిణిని హత్య చేసిన భర్త



గర్భిణి అయిన భార్య(23)తో గొడవ పడిన ఒక వ్యక్తి ఆమె ప్రైవేట్ పార్ట్‌లో హాక్సా బ్లేడ్ చొప్పించి దారుణ హత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మే 14న ఛత్తీస్‌గఢ్ సర్గుజా జిల్లాలోని భిత్తికాలా గ్రామంలో ఈ ఘటన జరిగింది. నిందితుడు తరచూ మద్యం సేవించి తన భార్యతో గొడవ పెట్టుకొని ఆమెను కొట్టేవాడు. ఇదే విధంగా గత వారం గొడవ పెట్టుకొని మూడు నెలల గర్భిణి అయిన తన భార్య ప్రైవేట్ పార్ట్‌లోకి హాక్సా బ్లేడ్ చొప్పించాడు. అయితే తన భార్య రోడ్డు ప్రమాదంలో గాయపడిందని చెప్పి దవాఖానకు తీసుకెళ్లాడు. ఆమె అప్పటికే చనిపోయిందని వైద్యులు ధ్రువీకరించగానే నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. మృతురాలి ప్రైవేట్ పార్ట్ నుంచి 10 అంగుళాల పొడవైన ఇనుప కడ్డీ లాంటి వస్తువును వెలికి తీశామని శవ పరీక్ష చేసిన వైద్యులు తెలిపారు. నిందితుడిని గత ఆదివారం అరెస్ట్ చేసి విచారించగా నేరాన్ని అంగీకరించాడు.

# సోమవారం భక్తుల రద్దీతో కళకళలాడిన శ్రీ భీమేశ్వర ఆలయం





- బద్ది పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక బోనాలు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మే 19 :**

వేములవాడలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి టెంపుల్ లో వేసవి సెలవులు మరియు సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా నెలకొంది. తెలంగాణ నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం వేములవాడలోని శ్రీ బడ్డీ పోచమ్మ అమ్మవారి టెంపుల్ వద్ద భక్తులు బోనాలు, కల్లు--బెల్లం, శాఖ పట్నాలు తదితర మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, శాంతి కలగాలని ప్రార్థిం చారు. “కోరిన కోర్కెలను కొంగు బంగారంగా తీర్చే రాజన్న-భీమన్న” అనే విశ్వాసంతో భక్తులు తరతరాలుగా వేములవాడకు వచ్చి మొక్కులు చెల్లిస్తున్నారు. కాళేశ్వరం, సమ్మక్క--సారలమ్మ జాతర, తిరుమల తిరుపతి, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే ముందు వేములవాడకు వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు, సంతానప్రాప్తి, నూతన దంపతుల శుభజీవితం, కుటుంబ సౌఖ్యం వంటి కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కోరికలు తీరిన అనంతరం భక్తులు తలనీలాలు, కోడెమొక్కులు, రుద్రాభిషేకాలు, అన్నపూజలు, నిత్య కళ్యాణాలు, చండీ హోమాలు, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, మహాలింగార్చనలు, ఆకుల పూజలు తదితర మొక్కులు చెల్లిస్తు న్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళాలు కూడా సమర్పిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి ఆలయ అధికా రులకు ప్రత్యేక సూచనలు జారీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ప్రాధాన్యత

వేములవాడలో భక్తుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారు గ్రామదేవతగా భక్తులచే పూజలందుకుంటున్నారు. అమ్మవారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, దుష్టశక్తులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ముఖ్యంగా ఆషాఢ మాసంలో బోనాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తారు. కల్లు--బెల్లం సమర్పించడం అమ్మవారికి ప్రీతికరమైన మొక్కుగా భావిస్తారు. గ్రామ ప్రజల రక్షకదేవతగా అమ్మవారు ప్రసిద్ధి చెందారు.



# ధాన్యం తరలింపు లారీల సంఖ్యను మరింత పెంచాలి

## కలెక్టర్ గరిమ అగర్వాల్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) మే 19**

మండల కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలను దర్శించిన కలెక్టర్ , జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ధాన్యం ఎంత వచ్చింది ఇప్పటిదాకా ఎంత కొనుగోలు చేశారో జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ మరియు ఎస్పీ మహేష్ ఆరా తీశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం సంచుల కోసం మరిన్ని వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారురైస్ మిల్లులో తనిఖీ చింతలకుంట పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత? ఇప్పటి వరకు ఎంత అన్ లోడ్ చేశారు? ఏ ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# పిలిస్తే పలుకుతా.. అకలితో అలమటించొద్దు...!

- పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- బీ ఆర్ ఎస్ నాయుకురాలు కాసాని పద్మ

**భద్రది కొత్తగూడెం రూరల్, మే 18,(ప్రజా తీర్పు )**



అశ్వారావుపేట మండలంలో ఎవరికి సాయం కావాలన్నా,ఆకలి అంటే తీర్చేలా కాసాని పద్మ గుర్తుకు వచ్చేలా సేవా కార్యక్రమాలు ఉంటాయని మండల బీ ఆర్ ఎస్ పార్టీ నాయుకురాలు కాసాని పద్మ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు సేవ చేయాలనేదే నా సంకల్పమని అన్నారు. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఆర్థికపరమైన ఆపద వస్తే వారికి అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆమె అన్నారు.

**ఆకలితో అలమటించొద్దని..**

ఆమె అన్నార్థులకు బాసటగా నిలవాలని సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. ఆమె వెళ్లేదారిలోని ఆకలితో అభాగ్యులు కనబడితే భోజనాలు అందిస్తున్నారు. పబ్లిసిటీ లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాసాని పద్మ చేస్తున్న సేవలకు ప్రజలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రముఖులు సైతం అభినందిస్తున్నారు. అన్నార్థుల ఆకలి తీర్చడంలో భాగంగా వంట సామగ్రిని కూడా అందజేశారు. అశ్వారావుపేట బస్టాండ్, సంత మార్కెట్ తదితర ప్రాంతాల్లోని ఆకలితో అలమటించే యాచకులు, నిరాశ్రయులకు భోజనం పెట్టి కడుపు నింపుతున్నారు ఆమె . అంతే కాదు కాసాని పద్మ నివాస పరిసర ప్రాంతాలలో తాజాగా మూగజీవాలకు సైతం భోజనం అందిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. నిరుపేదలపై జాలి,కనికరం, సహాయం గుణం కలిగిన కాసాని పద్మ బీఆర్ఎస్ పార్టీలో ఉండటం పార్టీకి ఎంతో బలం తోడైందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

# అవసరమైతే వీధి కుక్కలకూ కారుణ్య మరణం.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- ప్రజల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే
- బలవంతుడే బతుకుతాడు అన్న డార్విన్ సిద్ధాంతం నిజమవుతున్నది
- వీధి కుక్కలపై గతంలో మేము ఇచ్చిన తీర్పును సవరించే ప్రసక్తే లేదు

ప్రభుత్వ సంస్థలు, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలంటూ 2025 నవంబర్‌లో తాను జారీచేసిన ఆదేశాన్ని సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది. పలు విజ్ఞప్తులు వచ్చినప్పటికీ ఆ తీర్పును సవరించడానికి గానీ, నీరుగార్చడానికి గానీ కోర్టు నిరాకరించింది. అవసరమైతే రేబిస్ వ్యాధి సోకినట్లుగా, నయం చేయలేనివిగా భావించిన వీధి కుక్కలకు కారుణ్య మరణం కలిగించడానికి ప్రభుత్వం వెనుకాడకూడదని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బహిరంగ ప్రదేశాల్లో నిర్బల వర్గాలు ఎదుర్కొంటున్న కఠోర వాస్తవాలను న్యాయవ్యవస్థ విస్మరించకూడదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజరియాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. పౌరులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కూడా కోర్టు పేర్కొన్నది.

**తీర్పు ముఖ్యాంశాలు**

రేబిస్ సోకిన, నయం కాని వ్యాధితో బాధపడుతున్న లేదా స్పష్టంగా ప్రమాదకరమైన లేదా దూకుడు గల కుక్కల విషయంలో మానవ ప్రాణాలకు, భద్రతకు కలిగే ముప్పును సమర్థంగా అరికట్టడానికి కారుణ్య మరణం సహా చట్టబద్ధంగా అనుమతించిన చర్యలను పాటించాలి.చిన్న పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. వృద్ధులపై దాడులు జరిగాయి. చివరికి విదేశీ పర్యాటకులు కూడా ప్రభావితులయ్యారు. డార్విన్ చెప్పిన బలవంతుడే బతుకుతాడు అనే సిద్ధాంతం నిజమవుతున్నట్లు కనిపిస్తున్నది. ప్రభుత్వ చర్యలు లేని పక్షంలో పిల్లలను, వృద్ధులను వారి మనుగడ కోసం ఒంటరిగా పోరాడటానికి వదిలివేయకూడదు. ప్రజల ప్రాణాలకు, భద్రతకు రక్షణ కల్పించడం ప్రభుత్వ విధి. వీధి కుక్కకాటు సంఘటనలు దేశవ్యాప్తంగా పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో మూడు నెలల్లో 1,483 కేసులు వెలుగుచూశాయి. ఉదయ్‌పూర్‌లో 2026లో 1,700కు పైగా కేసులు నమోదయ్యాయి. తమిళనాడులో ఒక్క మార్చిలో 71,000 కేసులు, 34 మరణాలతోసహా గత ఏడాది 2,40,000 కేసులు నమోదయ్యాయి. ఈ ముప్పు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి సున్నితమైన ప్రదేశాలకు కూడా చేరింది. అక్కడ టెర్మినల్స్‌లో, రన్‌వేలపై కూడా వీధి కుక్కలు కనిపించడం ప్రజా భద్రతా చర్యల్లో తీవ్రమైన వైఫల్యాన్ని బయటపెట్టింది. ప్రభుత్వం మౌన ప్రేక్షకురాలిగా ఉండజాలదు. పిల్లలు, వృద్ధులు, అంతర్జాతీయ ప్రయాణికులు కుక్కకాటు ఘటనలకు బాధితులవుతున్న కఠోర వాస్తవ పరిస్థితులను న్యాయస్థానం విస్మరించజాలదు.

# జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

**(వినోద్, ప్రజా తీర్పు, కలెక్టరేట్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా) మే 19**



మంగళ వారం ఘట్కేసర్ మండలంలోని మాదారం ఏదిలాబాద్ గ్రామాలలో ధాన్యం సేకరణ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని లారీలు ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రానికి పంపించారని, ఇంకా ఎంత ధాన్యం ఉందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యంలోని తేమ శాతాన్ని అదేవిధంగా శుభ్రతను పరిశీలించారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకు న్నారు. రైతులు టార్పలిన్ సుత్తిలి బ్యాగులు అవసరమైన అంత లేవని అదేవిధంగా ట్రాన్స్పోర్ట్ లో ఆలస్యం జరుగుతుందని కలెక్టర్కు విన్నవించుకున్నారు. కలెక్టర్ స్పందిస్తూ రైతులకు అవసరమైన టార్పాలిన్ సుత్తిలి బ్యాగులు వెంటనే తెప్పించి రైతులకు అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 15 కేంద్రాలకు గాను 15 ప్యాడి క్లీనర్ మిషన్లను అందించాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు సూచించారు. ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు కేంద్రాలకు పంపించాలని అందుకు అవసరమైన లారీల ట్రాన్స్పోర్ట్ లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో సివిల్ సప్లై డిఎం సుగుణ బాయ్ డి సి ఎస్ ఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అధికారి చంద్రకళ, తహసీల్దార్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# అంబేద్కర్ కల్చరల్ అకాడమీకి జాతీయ విస్తరణ

## గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సి.హెచ్. శంకర్ ముదిరాజ్

**గోదావరిఖని, మే 19, (ప్రజా తీర్పు):**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీని జాతీయ స్థాయిలో విస్తరించేందుకు నూతన కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అకాడమీ జాతీయ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సి.హెచ్. శంకర్ ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్య సలహాదారులుగా సూర్యదేవర వెంకటేశ్వరరావు, సూర్యదేవర జ్యోతి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అకాడమీకి అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు కోర్ కమిటీ సభ్యుల నియామకాన్ని త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, ఢిల్లీ ప్రాంతాల్లో గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ, ప్రజాహిత కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతూ కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన అకాడమీని దేశవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో నూతన కమిటీల ఏర్పాటుతో పాటు జాతీయ స్థాయి కార్యవర్గం, కోర్ కమిటీని త్వరలో ప్రకటించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షుడు బొంకూరి మధు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సంకే రాజేష్, ప్రధాన కార్యదర్శి జొన్నల రవీందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



# పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట )మే 19**

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరశీ నర్సయ్యమాట్లాడుతూ మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు నిర్మాత బడుగు బలహీన వర్గాల పక్షపాతి అభ్యుదయ వాది అయినా పుచ్చలపల్లి సుందరయ్య పోరాటం ఈ దేశానికి బడుగు బలహీన వర్గాలకు ఎంతో ఉపయోగపడిందని పేద వర్గాలకు సేవ చేయడం కోసం రెడ్డి అనే పదము అడ్డు వస్తుందని తన పేరును పుచ్చలపల్లి సుందర రం రెడ్డికి బదులుగా పుచ్చలపల్లి సుందరయ్యగా పేరు మార్చుకొని పేద వర్గాల కోసం జీవించాడని అన్నారు పిల్లలు పుడితే తాము ఉద్యమానికి న్యాయం చేయలేమని తమకు సంతానమే వద్దు అనుకున్న మహానేత అని కొనియాడారు నేడు ఈ దేశానికి సుందరయ్య లాంటి నాయకులు కావాలని ఆయన ఆదర్శాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయన కలలు కన్నా రాజ్యం కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు రాజిరెడ్డి తిరుపతి భారతి మల్లారెడ్డి మల్లయ్య లక్ష్మీ రాజు శ్రీనివాస్ లక్ష్మి జ్యోతి తదితరులు పాల్గొన్నారు




# అక్రమంగా తరలిస్తున్న ఉసికెను పట్టుకున్న పోలీసులు

**(చింతలపల్లి వేణు ప్రజాతీర్పు బోయినపల్లి మండలం రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 19**

మిడ్ మానేరు రిజర్వాయర్, కొదురుపాక నందు అక్రమంగా మట్టి తవ్వకం మరియు రవాణా జరుగుతున్న సమాచారం మేరకు మిడ్ మానేరు రిజర్వాయర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గన్నా రాకేష్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో డ్యాంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఒక జేసీబీ సహాయంతో నాలుగు ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా నింపి తరలిస్తున్నట్లు గుర్తించారు. వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గన్నా రాకేష్ గారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లపై మరియు వాటి డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు.

# పెగడపల్లిలో దళితులకు ఆలయ ప్రవేశం నిరాకరణ

- బాధ్యులపై అట్రాసిటీ కేసులు పెట్టాలి
- డా. మార్శల్ దుర్గం నగేష్

**కాల్వ శ్రీరాంపూర్ , మే 19,(ప్రజా తీర్పు):**



పెద్దపల్లి జిల్లా కాల్వా శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో దళితులను ఆలయంలోకి రాకుండా అడ్డుకున్న ఘటనను సమతా సైనిక దళ్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ మండిపడ్డారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. “రాజ్యాంగబద్ధమైన దేశంలో ఇంకా కుల వివక్ష కొనసాగడం దురదృష్టకరం. దళితులను దేవాలయంలోకి రానివ్వకపోవడం మానవత్వానికి మచ్చ” అని అన్నారు. దేవుని ముందు అందరూ సమానమేనన్న భావనను కొందరు తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. దళితులను అడ్డుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కుల వివక్షను ప్రోత్సహించే శక్తులను ఉపేక్షించవద్దన్నారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా నిలవాలని, ఆలయంలోకి దళితులు గౌరవప్రదంగా ప్రవేశించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.

# రామగుండం అభివృద్ధికి రూ.9 కోట్లకు పైగా పనులు

- డీఎంఎఫ్టీ నిధులతో శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని, మే 19,( ప్రజాతీర్పు):**



రామగుండం నగరాన్ని విద్య, వైద్యం, ఉపాధి కల్పన కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డీఎంఎఫ్టీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన మేయర్ మహంకాళి స్వామితో కలిసి శంకుస్థాపనలు చేశారు. మేడిపల్లి రోడ్డులో 31, 32, 33, 35, 36, 37, 38, 39, 40, 43, 44, 45, 50, 53, 55, 60 డివిజన్లలో రూ.7.30 కోట్లతో చేపట్టనున్న పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం 30వ డివిజన్‌లో పవర్ హౌస్ నుంచి మజీద్ టర్నింగ్ వరకు పాత ఏసీ పైప్‌లైన్ తొలగించి కొత్త పైప్‌లైన్ వేసే రూ.1.80 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం తెలంగాణలోనే అద్భుత నగరంగా రూపుదిద్దుకుంటోందన్నారు. ఓపెన్‌కాస్ట్ ప్రభావంతో కోల్పోయిన మేడిపల్లి ప్రాంత వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విశాల రహదారులు, మౌలిక వసతులతో పాటు మూతపడిన ఓపెన్‌కాస్ట్ ప్రాంతంలో పంపింగ్ స్టోరేజ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరిశ్రమను సింగరేణి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంత భూములకు డిమాండ్ పెరిగి ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రూ.10 కోట్లు వెచ్చించి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పీకే రామయ్య కాలనీలో విశాల రహదారులు, మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. రామగుండం అభివృద్ధికి ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ చేయూత పింఛన్లు అందిస్తామని, ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి స్వంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో గతంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తిరిగి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారులను విస్తరిస్తున్నామని తెలిపారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి సహకారం అందిస్తామని చెప్పారు. రాబోయే రెండేళ్లలో రామగుండాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ గతంలో సిఎస్ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు మళ్లినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వచ్చిన తర్వాత పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారని చెప్పారు. రామగుండం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణశ్రీ, ఎస్ఈ గురువీర, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వండర్ వైభవ్.. దంచికొట్టిన సూర్యవంశీ



**లక్నోపై రాజస్థాన్ ఘన విజయం**
**ప్లేఆఫ్స్ రేసులో ముందంజ**

తన వయసు పిల్లలంతా వేసవి సెలవులను ఆస్వాదిస్తుంటే.. ఐపీఎల్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ (38 బంతుల్లో 7 ఫోర్లు, 10సిక్సర్లతో 93) మాత్రం వరల్డ్ క్లాస్ బౌలర్లను ఓ ఆటాడుకుంటున్నాడు. తన బ్యాట్ పవర్‌తో ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తున్నాడు. బంతి ఏ బౌలర్ చేతుల్లోంచి వచ్చినా ఈ బుడ్డోడి బ్యాట్ తాకగానే బౌండరీ దాటేస్తోంది. ఈ కుర్ర హీరో విధ్వంసానికి ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ బలైపోయింది..! చివరి మ్యాచ్‌ల్లో గెలిచి పరువైనా దక్కించుకోవాలని ఆశించిన జెయింట్స్ ఈ సూర్య 'ప్రతాపం' ముందు తేలిపోయింది. భారీ లక్ష్య ఛేదనలో ఖతర్నాక్ షాట్లతో ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించిన సూర్యవంశీ రాజస్థాన్‌కు అద్భుత విజయం అందించి జట్టును ప్లేఆఫ్స్ రేసులో నిలిపాడు.

ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన పోరులో రాజస్థాన్ రాయల్స్ సత్తాచాటింది. వైభవ్ వీరబాదుడు బ్యాటింగ్‌తో చెలరేగడంతో సొంతగడ్డపై మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం సాధించింది. లీగ్‌లో ఏడో విజయంతో పంజాబ్‌ను వెనక్కునెట్టి నాలుగో స్థానానికి చేరింది. తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా రాయల్స్ నేరుగా ప్లేఆఫ్స్ చేరుకోనుంది. లక్నో ఇచ్చిన 221 పరుగుల లక్ష్యాన్ని రాయల్స్ 19.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది. ధ్రువ్ జురెల్ (38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 53 నాటౌట్), స్టాండిన్ కెప్టెన్ యశస్వి జైస్వాల్ (43) కూడా రాణించారు. తొలుత మిచెల్ మార్ష్ (57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96), జోష్ ఇంగ్లిస్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60) మెరుపులతో లక్నో 20 ఓవర్లలో 220/5 స్కోరు చేసింది. వైభవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

### దంచుడే.. దంచుడు

సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్‌కు జైస్వాల్, జురెల్ మెరుపులు తోడవడంతో భారీ లక్ష్యాన్ని రాజస్థాన్ అలవోకగా అందుకుంది.ఓపెనర్లు జైస్వాల్, వైభవ్ తొలి వికెట్‌కు 75 రన్స్ జోడించి విజయానికి బాటలు వేశారు. తొలి ఓవర్లోనే నాలుగు ఫోర్లు కొట్టిన జైస్వాల్.. మోసిన్ ఖాన్ వేసిన నాలుగో ఓవర్లో 6, 4, 4, 4తో విజృంభించాడు. తన స్టయిల్‌కు భిన్నంగా తొలి పది బంతుల్లో 5 రన్స్ మాత్రమే చేసిన సూర్యవంశీ.. మయాంక్ ఐదో ఓవర్లో సిక్సర్ల ఖాతా తెరిచాడు. ప్రిన్స్ యాదవ్‌ను 6,4,6తో శిక్షించి పవర్ ప్లేను 71/0తో ముగించాడు. ఏడో ఓవర్లో జైస్వాల్‌ను ఔట్ చేసిన ఆకాశ్ సింగ్ లక్నోకు బ్రేక్ ఇచ్చాడు. కానీ, ఈ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. జురెల్ తోడుగా సూర్యవంశీ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వచ్చాడు. ఆకాశ్ వేసిన తొమ్మిదో ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 రన్స్ పిండుకున్నాడు. 23 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్న ఈ యంగ్ బ్యాటర్ తర్వాత మరింత భారీ షాట్లతో స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. ప్రిన్స్ ఓవర్లో 6, 6 బాదాడు. ఇక, మయాంక్ బౌలింగ్‌లో ధ్రువ్ 4, 6, 6 కొడితే.. వైభవ్ రెండు సిక్సర్లు బాదడంతో ఏకంగా 29 రన్స్ లభించాయి. స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ బౌలింగ్‌లో 6, 4 కొట్టి 90ల్లోకి వచ్చిన వైభవ్ సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ, మోసిన్ వేసిన 14వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి సమద్‌కు క్యాచ్ ఇవ్వడంతో రెండో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి 180/2తో నిలిచిన రాయల్స్ గెలుపు ఖాయం అయింది. వరుసగా 26 బంతుల్లో ఒక్క బౌండరీ ఇవ్వని లక్నో బౌలర్లు కాస్త ఒత్తిడి పెంచారు. ప్రిన్స్ బౌలింగ్‌లో సిక్స్‌తో జురెల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆఖరి ఓవర్ తొలి బంతికి డొనొవాన్ (16 నాటౌట్) విన్నింగ్ సిక్స్ కొట్టాడు.

### మార్ష్, ఇంగ్లిస్ మోత

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్ భారీ స్కోరు అందించారు. ఈ ద్వయం రాజస్థాన్ బౌలర్లపై ఆది నుంచి విరుచుకుపడింది. ఆర్చర్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే మార్ష్ వరుస బంతుల్లో ఫోర్, సిక్స్‌తో పరుగుల ఖాతా తెరిచాడు. మరో ఎండ్‌లో ఇంగ్లిస్ కూడా బ్యాటు ఝులిపించడంతో పవర్‌ప్లేలోనే 83 పరుగులు లభించాయి. ఈ జోడీని విడదీసేందుకు రాయల్స్ స్టాండిన్ కెప్టెన్ జైస్వాల్ బౌలింగ్ మార్పులు ఫలించ లేదు. ఈ క్రమంలో 23 బంతుల్లో ఇంగ్లిస్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. బ్రిజేష్ శర్మ 8వ ఓవర్‌లో ఆఖరి బంతికి మార్ష్ సిక్స్‌తో లక్నో 105 పరుగులకు చేరుకుంది. అయితే యశ్‌రాజ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన ఇంగ్లిస్..క్లీన్‌బౌల్డ్ కావడంతో తొలి వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇంగ్లిస్ స్థానంలో క్రీజులోకి వచ్చిన పూరన్ (16).. మార్ష్‌కు జతకలిశాడు. ఈ దశలో పరుగుల రాక ఒకింత మందగించినా..షనక బౌలింగ్‌లో ఫోర్‌తో మార్ష్ 25 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. పూరన్ ఔటైన తర్వాత వచ్చిన పంత్ (35) నెమ్మదిగా ఆడటంతో లక్నోకు పరుగుల రాక కష్టమైనా..మార్ష్ తన జోరు కొనసాగించాడు. ఒక దశలో 250 పరుగులు సాధిస్తుందనుకున్న లక్నో ఆఖరి ఓవర్లలో ఘోరంగా తడబడి 220 స్కోరుకు పరిమితమైంది. 3 లీగ్‌లో సూర్యవంశీ 10 అంతకంటే ఎక్కువ సిక్సర్లు కొట్టడం ఇది మూడోసారి. క్రిస్ గేల్ అత్యధికంగా నాలుగు సార్లు ఈ ఘనత సాధించాడు. 53 ఈ సీజన్‌లో సూర్యవంశీ కొట్టిన సిక్సర్లు. ఒక అంచెలో రెండో అత్యధికం. క్రిస్ గేల్ 2012లో 59 సిక్సర్లు కొట్టి టాప్‌లో ఉన్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**లక్నో: 20 ఓవర్లలో 220/5(మార్ష్ 96, ఇంగ్లిస్ 60, యశ్‌రాజ్ 2/35, ఆర్చర్ 1/39);**
**రాజస్థాన్: 19.1 ఓవర్లలో 225/3 (సూర్యవంశీ 93, జురెల్ 53లి, ఆకాశ్ సింగ్ 1/54).**

# పంత్‌పై వేటు.. కుర్రాళ్లకు పిలుపు

- టెస్టు వైస్ కెప్టెన్సీతోపాటు వన్డే టీమ్ నుంచి రిషబ్ ఔట్
- ఆఫ్ఘానిస్థాన్‌తో టెస్టు, వన్డే సిరీస్‌కు జట్ల ప్రకటన
- సుతార్, గుర్నూర్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబేకు చాన్స్



ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ భారత వన్డే జట్టు నుంచి ఉద్వాసనకు గురయ్యాడు. టెస్టు జట్టు వైస్ కెప్టెన్సీ కూడా కోల్పోయాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే వచ్చే నెలలోఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌కు సీనియర్ సెలెక్షన్ కమిటీ మంగళవారం వేర్వేరు జట్లను ప్రకటించింది. గిల్ కెప్టెన్సీలోని ఇరు జట్లలో నలుగురు కొత్త ఆటగాళ్లకు చోటు ఇచ్చిన కమిటీ కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. టెస్టు జట్టు వైస్ కెప్టెన్సీ నుంచి పంత్‌ను తప్పించి ఆ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించింది. ఇకపై టెస్టుల్లో పంత్ కేవలం కీపర్, బ్యాటర్‌గానే ఉంటాడు. వన్డే జట్టులో తను పూర్తిగా చోటు కోల్పోయాడు. వన్డేల్లో రాహుల్‌తో పాటు రెండో కీపర్‌గా ఇషాన్ కిషన్ పునరాగమనం చేశాడు. పంత్ వైట్ బాల్ క్రికెట్ ప్రణాళికల్లో ప్రస్తుతానికి లేడనే విషయాన్ని అగార్కర్ పరోక్షంగా స్పష్టం చేస్తూ.. అతను టెస్టుల్లో అత్యుత్తమ ప్రదర్శన చేయడంపైనే దృష్టి పెట్టాలని తాము భావిస్తున్నట్లు పేర్కొన్నాడు.స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు టెస్టుతో పాటు వన్డే సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు. రాబోయే ఇంగ్లండ్ టూర్ నేపథ్యంలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు రెస్ట్ ఇచ్చినట్టు చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపాడు.

### యువ స్పిన్నర్లపై మొగ్గు..

భవిష్యత్తు అవసరాలను, 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని సెలెక్టర్లు స్పిన్ విభాగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు టెస్టు మ్యాచ్‌కు విశ్రాంతినిచ్చినట్లు స్పష్టం చేసిన అగార్కర్.. మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను రెండు జట్ల నుంచి తప్పించాడు. బంతిని టర్న్ చేయడంలో అక్షర్ విఫలమవడం, బ్యాటింగ్ ఫామ్ క్షీణించడమే దీనికి కారణమని తెలుస్తోంది. జడ్డూ, అక్షర్ స్థానాల్లో యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ ద్వయం మానవ్ సుతార్, హర్ష్ దూబేను టెస్ట్ జట్టులోకి తీసుకున్నారు. దూబే వన్డే జట్టులోనూ చోటు సంపాదించాడు. అలాగే, ఈ రంజీ సీజన్లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన 6.6 అడుగుల పంజాబ్ యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు రెండు జట్లలో అవకాశం కల్పించారు. ఐపీఎల్‌లో ఆకట్టుకుంటున్న లకో యంగ్ పేసర్ ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోకి వచ్చాడు. ముల్లన్‌పూర్ వేదికగా జూన్ 6న టెస్టు మ్యాచ్ జరగనుండగా.. అదే నెల 13, 17, 20వ తేదీల్లో వరుసగా ధర్మశాల, లక్నో, చెన్నైలో మూడు వన్డేలు షెడ్యూల్ చేశారు. కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్న లెజెండరీ క్రికెటర్లు రోహిత్ వర్మ, విరాట్ కోహ్లిని వన్డే సిరీస్‌కు ఎంపికయ్యారు. అయితే రోహిత్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుందని సెలెక్టర్లు తెలిపారు.

# ఉనికి కోసం ఎంపీ అరవింద్ చిల్లర మాటలు

- 2034 వరకు రేవంత్ రెడ్డే సీఎం
- ఎంపీ అరవింద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 19**



నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మంగళవారం అశోక్ నగర్‌లోని తన నివాసం నుండి విడుదల చేసిన ఒక పత్రిక ప్రకటన ద్వారా ఆయన తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయ విమర్శలు ప్రజా అంశాలపై ఉండాలని, దేశ అత్యున్నత పదవులు, రాజ్యాంగ హోదాల్లో ఉన్న నాయకులపై ఆధారాలు లేని వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఎంపీ అరవింద్‌పై బిజెపి అధిష్టానం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. బరాబర్ 2034 వరకు సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటారు రాసిపెట్టుకో. నీకు దమ్ముంటే చేతనైంది చేసుకో అని ఎంపీ అరవింద్‌కు సవాల్ విసిరారు. లేకపోతే చేతులు ముడుచుకొని కూర్చోవాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డి మరో సువేందు అవుతారేమోనని అనుమానం వ్యక్తం చేస్తూ ఆయనకు మోదీతో లింకు ఉందని ఆరోపించడం తగదన్నారు. ప్రధానమంత్రి పేరును అనవసరంగా రాజకీయ వివాదాల్లోకి లాగడం బాధ్యతాయుత రాజకీయాలకు సరిపడదని చెప్పారు. అలాంటి వ్యాఖ్యలను బిజెపి అధిష్టానం సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంపీ ధర్మపురి అరవింద్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రేవంత్ రెడ్డిని విమర్శించడానికి అరవింద్ ప్రధాని మోదీని, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని కూడా తప్పు పడుతున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోకి రేవంత్ రెడ్డి ఎలా వచ్చారు, ఎలా అధికారంలోకి తెచ్చారన్నది దేశానికి, మోదీకి కూడా తెలుసు. మాతో కలువు అని మోదీ చేయి చాపాడంటే రేవంత్ రెడ్డికి ఎంత గౌరవం ఉందో తెలుస్తుందన్నారు. బిజెపి అన్ని చోట్ల ఒరిజినల్ బిజెపి వాళ్లకే పదవులు ఇచ్చిందా? పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి, అస్సాం సీఎం హేమంత బిశ్వ శర్మ ఏ పార్టీ నుంచి వచ్చారని ప్రశ్నించారు. తెలివి లేక అరవింద్ దద్దమ్మ మాటలు మాట్లాడటం సిగ్గుచేటు కాదా అని నిలదీశారు. అరవింద్.. నీ పుట్టుక ఎక్కడ? కాంగ్రెస్ పార్టీనే కదా. డీఎస్ లేకపోతే నీ బతుకు ఎక్కడ అరవింద్? అమ్మ పాలు తాగి రొమ్ము గుద్దినట్లు అరవింద్ తీరు ఉందని ధ్వజమెత్తారు. బీసీ నాయకుడిగా డీఎస్ కు కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రాధాన్యత పదవులు ఇచ్చింది. అర్వింద్ బిజెపికి కిరాయికి పోయాడు. డీఎస్ కొడుకు కాకపోతే అరవింద్‌కు రాజకీయ జీవితం ఎక్కడిది? నిఖార్సైన బిజెపి నాయకుడిగా ఎలా చెప్పుకుంటాడని ప్రశ్నించారు. రెండు సార్లు ఎంపీగా ప్రజలు అవకాశం ఇస్తే నిజామాబాద్ అభివృద్ధికి చేసిన ప్రధాన కార్యక్రమాలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శల కంటే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, నిజామాబాద్ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వంపైన విమర్శలు చేయొచ్చు కాని పిచ్చిపిచ్చిగా వాగొద్దని హెచ్చరించారు. అరవింద్ కంటే ఎక్కువ స్థాయిలో స్పందించే శక్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఉందన్నారు. రాహుల్ గాంధీ గారిని ప్రధాని చేస్తామని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢంకా బజాయించి మరీ చెపుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఎంపీ అరవింద్ బేషరతుగా ఉపసంహరించుకోవాలని శ్రీరామ్ డిమాండ్ చేశారు. రాజకీయాల్లో హుందాతనం పాటించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని స్పష్టం చేశారు. బిజెపి అధిష్టానం వెంటనే స్పందించి అరవింద్‌పై చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో స్పందిస్తాయని హెచ్చరించారు.

# చరిత్రకు చేరువలో బంగ్లా!.. పాక్‌తో రెండో టెస్టు




సిల్హెట్: పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ చారిత్రక విజయానికి చేరువైంది. సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో కొనసాగుతున్న బంగ్లా..రెండో టెస్టుపై మరింత పట్టు బిగించింది. 437 పరుగుల భారీ లక్ష్యఛేదన కోసం నాలుగో రోజు మంగళవారం బరిలోకి దిగిన పాక్..7 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. వికెట్‌కీపర్ మహమ్మద్ రిజ్వాన్(75 నాటౌట్), సాజిద్‌ఖాన్(8 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చేతిలో మూడు వికెట్లు ఉన్న పాక్..విజయానికి 121 పరుగుల దూరంలో ఉంది. రిజ్వాన్‌తో పాటు కెప్టెన్ షాన్ మసూద్(71), సల్మాన్ ఆగా(71) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా రిజ్వాన్ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఆగాతో కలిసి ఆరో వికెట్‌కు 134 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. తైజుల్ ఇస్లాం(4/113) ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన పాక్‌ను రిజ్వాన్ ఆదుకున్నాడు. మరో రోజు మిగిలి ఉన్న మ్యాచ్‌లో మూడు వికెట్లు తీస్తే..టెస్టు సిరీస్ బంగ్లా వశమైనట్లే.



## టీమిండియా క్రికెటర్‌తో కోర్టు హీరోయిన్ ప్రేమాయణం! అసలు విషయం తెలిస్తే ఆశ్చర్యపోతారు

కోర్టు సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది యంగ్ హీరోయిన్ శ్రీదేవి అప్పాల. ఇందులో జాబిలి పాత్రలో ఆమె అందం, అభినయానికి అందరూ ఫిదా అయ్యారు. ముఖ్యంగా శ్రీదేవి క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ కు యూత్ పడిపోయారు. సినిమా కూడా సూపర్ హిట్ గా నిలిచింది. సినిమాల సంగతి పక్కన పెడితే తన వ్యక్తిగత జీవితంతోనూ వార్తల్లో నిలుస్తోంది శ్రీదేవి. గతంలో తనతో కలిసి నటించిన హర్ష్ రోషన్ తో ప్రేమలో ఉందని ప్రచారం జరిగింది. అయితే అవన్నీ పుకార్లనని కొట్టి పారేసింది శ్రీదేవి. ఇప్పుడు ఓ టీమిండియా యంగ్ క్రికెటర్ తో శ్రీదేవి ప్రేమలో ఉందంటూ కొన్ని వార్తలు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఐపీఎల్ లో అదరగొడుతోన్న ఓ యంగ్ సెన్సేషన్ తో శ్రీదేవి పేరును ముడిపెడుతూ కొన్ని పోస్టులు నెట్టింట వైరలవుతున్నాయి. అయితే ఇవన్నీ వట్టి రూమర్లేనని తెలుస్తోంది. కొందరు నెటిజన్లు కావాలని ఈ రూమర్స్ ను క్రియేట్ చేశారని తెలుస్తోంది.

## తెలుగులో నా ఫేవరేట్ హీరో ఆయనే.. ఒక్క ఛాన్స్ వస్తే అస్సలు వదిలిపెట్టను..



రామ్ పోతినేని నటించిన 'రెడ్' సినిమాలో "దింతక దింతక" సాంగ్‌లో స్పెషల్ అప్పీరెన్స్‌తో మాస్ ఆడియన్స్‌ను అలరించారు. ఇటీవలే ఓదెల రైల్వే స్టేషన్ సినిమాతో మరో సక్సెస్ అందుకున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు ఇష్టమైన హీరో గురించి వెల్లడించింది. అంతేకాదు అతడితో ఛాన్స్ వస్తే నటించేందుకు రెడీగా ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ (జీతీ చీ=) పై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో తన ఫేవరెట్ యాక్టర్ గురించి అడిగిన ప్రశ్నకు హెబ్బా పటేల్ ఏమాత్రం తడుముకోకుండా జూనియర్ ఎన్టీఆర్ పేరు చెప్పారు. తారక్ నటన, ఆయన పర్సనాలిటీ అంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. 'కుమారి 21ఖీ' సినిమా టీజర్ లాంచ్‌కు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వచ్చినప్పటి నుండి ఆయనపై తనకు ప్రత్యేకమైన అభిమానం ఏర్పడిందని హెబ్బా గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమాతో నటించే అవకాశం వస్తే ఎలాంటి పాత్రకైనా సిద్ధమేనని హెబ్బా పటేల్ స్పష్టం చేశారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020